# ఆడదాని అదృష్టం

నాకు ఒంటరిగా వుండాలంటే భయమేం కాదు. కాని ఒంటరిగా వుండాల్సి వచ్చినందుకు మాత్రం చాలా బాధగా వుంది.

విశాలమైన బంగళా, పెద్ద పెద్ద గదులు. మానాన్న డ్రాయింగ్ రూమ్ విసిరేసినట్లు ఓ మూలగా వుంటుంది. ఆయనక్కడ కూర్చుని చదువుకుంటున్నాకూడా అంత ఇంట్లోనూ నేను ఒక్కర్తెనే వున్నట్లనిపిస్తుంది. పెద్దహాల్లో సోఫాలో కూచుని ఏ రేడియోగ్రామ్ పెట్టుకోవడమో, లేకపోతే మా నాన్న టేప్ చేసిన పాతరికార్డు వింటమో నాకు సరదాయే! కాని! ఎంత సేపని! బోరుకొట్టేస్తుంది. ఓ గదిలోంచి ఓగదిలోకి అటు ఇటూ పచార్లు చేస్తూవుంటా. అప్పటికీ యేం తోచదు. చప్పున ఇంటిచుట్టూ తిరగడానికి చకచక బయటికి వచ్చేస్తా. గులాపూవ్వులంటే నాకు తెగ యిష్టం. సగానికి పైగా తుంచేసిన కొమ్మలు యిప్పుడిప్పుడే చిగుర్లేస్తున్నాయి. ఆ గులాబి మొక్కలు చూసినప్పుడల్లా మా అమ్మ ఇట్టే కళ్ళలో కనిపిస్తుంది. చప్పున

కళ్ళు మూసుకుంటా. నన్ను అంతద్వేషించి, హింస పెట్టి, నామనస్సు క్షోభ పెట్టిన మా అమ్మ నాకు గుర్తుకు రావటం ఆశ్చర్యంగానే వుంటుంది. అయితే ఆమె మీద ప్రేమకొద్దీ నాకు జ్ఞాపకము రావటంలేదు. ఆ గులాబి మొక్కలన్నిటిని చిత్రహింస చేసేసింది. పూలంటే మా అమ్మకు ఇష్టంలేక కాదు. పూలమొక్కలంటే మహా ఇదియ్యేది. కాని మానాన్న తెచ్చిపెట్టాడుగా ఆ గులాబి అంట్లన్నీ అందుకు వాటిమీద కసి. అంతకంటే చిత్రంగా వుంటుంది, నా మీద చెడ్డకోపం. నేనంటే సరి విరుచుకు పడేది. నేను చేసిన తప్పేమిటో నాకు కనిపించేది కాదు. నేను చేసిన పొరపాటేమిటో చెప్పమ్మా అని యెన్నోసార్లు బ్రతిమాలేదాన్ని. ఏమనేదికాదు. నాకు మా నాన్న పోలిక వచ్చిందట. ఆయన నేనంటే యెంతో యిదిగా చూస్తాడు. నా మీద కోపానికి యిదే కారణం.

సరే అవన్నీ ఇప్పుడెందుకు. అయిపోయిందేమిటో అయిపోయింది. తన పంతమేమిటో, తన పట్టుదల ఏమిటో అంతేతప్ప యితరులు యేమను కోంటారో అనేమాటే లేదు. మా నాన్నంటే ఎంత ఈసడింపో చెప్పటానికి వీల్లేదు. ఆ తిరస్కారం ఆ విదిలింపూ మా నాన్న కాబట్టి భరించాడు. ఇం కొకరయితే ఒక్క క్షణం సహించే వాళ్ళుకాదు. అయితే మా అమ్మను నేను విమర్శించ కూడదేమో. ఆమెను గురించి చెడుగా కూడా ఏమి అనుకో కూడదు. ఆమెను పూజించాలి. ఆమె నాకు జన్మ ఇచ్చింది. జన్మజన్మలకు ఆమె ఋణాన్ని నేను తీర్చుకోలేను. అయితే మా అమ్మను గురించి మంచిగా చెప్పుకొనే విషయం ఒక్కటీ లేదే. నన్నేం చేయమంటారు.

మా బంగళా చుట్టూ రకరకాల మొక్కలు తమాషాగా పెరిగిపెద్ద వయి మాక్కావలసినన్ని పూలు, కాయలు, పండ్లు ఇస్తున్నాయి. కృతజ్ఞ తగా వుండాల్సింది వాటికి. అవి నోరు లేకపోయినా నా అవసరాలేమిటో, నా అభిరుచులేమిటో తెలుసుకొని నాకు కావలసినవన్నీ ఇస్తున్నాయి. నేనూ

వాటికి నీళ్ళుపోస్తున్నాను. కావలసినప్పుడు తగిన రక్షణ యిస్తున్నాను. అట్టే ఆలోచిస్తే నాకొకటి తడుతుంది. ప్రతి మనిషికి ఏదో ఒక రక్షణ అంటూ ఉండాలి. యెప్పుడు యెక్కడ యెవరు యిలాంటి ప్రశ్నలకు నాకిప్పుడు సమాధానాలేవీ తట్టడం లేదు. ఆ పూలమొక్కల్ని చూస్తుంటే నామనస్సు నిండా వింత వింత ఆలోచనలు నిండుతాయి. మెదలకుండా నిశ్శబ్దంగా నాకు కావలసినవన్నీ ఇస్తుంటాయే వాటిని నేనేమని పొగడాలి. తెల్లారి లేచినప్పటినుంచి ఆతోటలోనే తిరుగుతూ కాలక్షేపం చెయ్యాలని పిస్తుంది. కాని నా మనస్సు యిట్టే వికలమయి పోతుంది. ఇంకా మా అమ్మ నన్ను తిడుతున్నట్లే, మా నాన్నను ఏదో అంటున్నట్టే, అనిపిస్తుంది. చప్పున లోపలికి వచ్చేస్తాను.

ఆ పెద్దహాలులో తిరుగుతూ వుంటే మా అమ్మ నా వెనకాలే వచ్చి నన్ను కొట్టబోతున్నట్లు, నన్నేదో అంటున్నట్లు అనిపిస్తూవుండేది. చప్పున ఉలిక్కిపడేదాన్ని. ఇట్టేవెనక్కు తిరిగి చూసేదాన్ని, ఎవ్వరూ లేరు. నా వూహ నా భయం అంతే. మరీ కొత్తల్లో తలుపు చప్పుడైతే గుండె దడ దడ కొట్టుకునేది. అదిగో మళ్ళీ అమ్మ వస్తోంది, అనిపించేది. అందరి అమ్మలు వేరు. మా అమ్మ వేరు. మా అమ్మ లాంటి అమ్మ ఎవ్వరికి కూడా వుండకూడదని అలాంటి అమ్మే వుండాల్సివస్తే అసలు అమ్మంటూనే వుండకూడదని అనుకునే దాన్ని.

క్రమక్రమంగా బాగా అలవాటయిపోయింది. అంతంత పెద్దహాలుల్లో ఒంటరిగా యెన్ని గంటలయినా గడిపగలను. నాకుతోడూనీడా పుస్తకాలు రికార్డు. పుస్తకాలు చదువుతున్నంతసేపు ఆ కథల్లో వుండే ఏ ఒక అమ్మాయి లోనో లీనమయిపోయేదాన్ని. ఆ అమ్మాయే నేననుకొని వూహించుకుని దువుతూ వుంటాను. ఎక్కడో మలుపు తిరుగుతుంది. ఇహ ఆ అమ్మా

యికీ నాకు యే సంబంధం లేదు. ఆ అమ్మాయి వేరు నేను వేరు. ఆ అమ్మాయి మనస్తత్వం వేరు, ఆపరిస్థితుల్లో ఆ అమ్మాయి మాదిరి నేను యెన్నటికి ప్రవర్తించేదాన్ని కాదనుకునేదాన్ని. వెంటనే పుస్తకం మూసేసే దాన్ని. అట్లాగే రికార్డులునూ. ఏదైనా మంచిపాట వస్తే నేనుకూడా పాడే దాన్ని. నా గొంతుక మంచిది. అపస్వరాలు రావు. ఎవరు ఏది చెబితే అది పాడగలను. రికార్డు గనక రెండుసార్లు వింటే నేను మళ్ళీ అదే మాదిరి పాడగలను కూడా. అట్లాగే నాకు యెన్నోపాటలు నోటికొచ్చు. యెన్ని రోజులు, యెన్ని నెలలు గడిపానో నాకు తెలియదు. ఎన్నోయుగాలు గడి చినట్లుగా వుంటుంది. నిజంగా మా అమ్మ తమ్ముడూ వెళ్ళిపోయి యెన్నా ళ్ళయిందంటే నేను సరిగ్గా చెప్పలేను.

అన్నట్టు ఆనాడు నాకు బాగా గుర్తు. మా అమ్మ వంటిట్లో అన్నం వండుతున్నట్టు నటిస్తూ కూర్చుంది. మేమేమో వంటయిపోతోంది గదా అని అనుకున్నాము. కాలేజి టైమవుతోంది, వంట అయిందా అని అడిగే ధైర్యం మా నాన్నకు లేదు. వంటమనిషిని ఎందుకు మానిపించావు అని అడిగే ధైర్యం అంతకంటే లేదు. పదిగంటలవుతోంది. నేనే మా తమ్ముడ్ని మెల్లిగా పంపించా అమ్మను అడిగిరా వంట అయిందేమోనని. ఇది ప్రతిఇంటా జరిగే విషయం. దీంట్లో కొత్తదనంగాని వింతగాని యేంలేదు. అమాంతం వంటిం ట్లోంచి హాల్లోకి వచ్చేసింది. 'నేను దాసిననుకున్నావా? నీ యిష్టం వచ్చిన వాళ్ళతో కులుక్కుంటూ పగలంతా బలాదూరు తిరిగి తిండి కావలసొచ్చేట ప్పటికి యిల్లు కనిపించిందేం.' ఈ మాటలేకాదు, అసలు అలాంటి మాటలు ఆడది అందంటే ఎవ్వరూ నమ్మరు. అందులో మా అమ్మ అందని నే చెప్పితే నన్నే అంటారు అందరూ. అందుకనే నేనేమి చెప్పను. ఆ మాటలు చాలా రోజులవరకు నా చెవుల్లో గింగిరుమంటూ వుండేవి. నాకు అదురుగా వుండేది. ఏమిటి ఈ మాటలు అన్నది మా అమ్మేనా అనిపించేది. ఎప్పుడూ ఎన్ని

అన్నా కూడా మెదలకుండా వూరుకునే మానాన్నకూ కూడా మతిపోయి నట్లయింది. ఆయన లేచాడు. ఇద్దరూ హోరా హోరి పోట్లాడుకున్నారు. మాటమాట అనుకున్నారు. చేతులు కలపటం కూడా అయిపోయింది. కొంచెంలో తప్పిపోయింది, పెద్దప్రమాదిమే లేకపోతే నేనెక్కడ వుండే దాన్నో అసలు ఈ లోకంలో వుండేదాన్నో కాదో! మానాన్న లేకపోయిన తర్వాత నన్ను చూసేదెవరు? నన్ను ఆదరించేదెవ్వరు? ఆ దృశ్యం కళ్ళ ముందుకు వచ్చినప్పుడల్లా నాకాళ్ళు, చేతులు వణికిపోతుండేవి. అదే చివరి పోట్లాట. అంతకు మునుపు ఎన్ని ఘర్షణలు జరిగినా, మళ్ళీ ఇంట్లోకి నలుగురూ వచ్చేవాళ్ళు.

అదే చివరి రోజు. మళ్ళీ మాఇంట్లో మేం నలుగురం యెప్పుడూ కలిసి వుండలేదు. మా అమ్మ తమ్ముడ్ని తీసుకుని పెద్దలారీ నిండా సామాను వేసుకొని మా తాతయ్య గారింటికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న ప్పుడు నా వంకకూడా చూడలేదు. 'నువ్వు నాన్నతో పాటే ఈ యింట్లోనే ...' ఏదో తిట్టిపోసింది. మెటికలు విరిచింది. మా తమ్ముడికి పదేళ్ళుంటా యేమో! వాడికేం తెలీదు. మా అమ్మంటే చాలు, యింకేమీ అక్కర్లా వాడికి. నేను పిలిస్తే దగ్గరికి వచ్చేవాడు, కాదు! మా నాన్నంటే అసలే భయం. నిజానికి వాడికి భయం లేదు. మా అమ్మ నేర్పిన పాఠం. ఏమయితేనేం మా అమ్మతో వెళ్ళి పోయాడు.

ఇంత పెద్ద బంగళా లోనూ నేనూ, మా నాన్న మిగిలి పోయాము. నేను ఆయన్ను ఓదార్చాలో, నన్ను ఆయన ఓదార్చాలో యెవరికీ యేమీ తెలియక అయోమయంగా వుండిపోయాం. మేమిద్దరం కూడా యేమీ మాట్లాడే వాళ్ళం కాదు. వంటమనిషి వంట చెయ్యంగానే టేబుల్ మీద అన్నీ పెట్టేసేది. నేనూ మా నాన్న వచ్చేసి భోంచేసేవాళ్ళం. మా నాన్న సూటిగా కాలేజీకి వెళ్ళిపోయేవాడు. వంటమనిషి మళ్ళీ సాయంత్రం అయితే గాని రాదు. ఇహ నేను ఒంటరిగా వుండేదాన్ని. అట్లా ఒంటరిగా వుండటం నాకు బాగా అలవాటు అయిపోయింది నాకేం భయం లేదు. అందుకనే నా కనిపిస్తుంది. ఒంటరితనం అంటే భయం లేదు. కాని ఒంట

రిగా వుండాల్సి వచ్చిందే అని బాధగా మాత్రం వుండేది.

మా నాన్న సాయంత్రం అయిదు దాటంగానే ఓ సారి ఇంటికి వచ్చేసి టీ త్రాగి డ్రెస్ మార్చుకొని క్లబ్బుకు వెళ్ళుతూ వుంటాడు. మళ్ళీ రాత్రిఎనిమిది అవుతూ వుండగానే లేకపోతే ఇంకొంచెం ఆలస్యంగానో వస్తూ వుంటాడు. నాకు ఆ యిల్లంతా పరిచయమే. అన్ని గదులు, మారుమూలలూ నాకు తెలుసు. అయితే రెండో బెడ్‌రూమ్‌కు వెళ్ళాలంటే మాత్రం బెరుకుగానూ, భయంగానూ వుండేది. దానికి ప్రత్యేక కారణం వుంది. అన్నట్టు చెప్పటం మరిచేపోయాను. మా అమ్మ వెళ్ళింది. వూరుకోలేదు. డైవోర్స్‌కు నోటీసు ఇప్పించింది. మా నాన్న ఆనాడు కాలేజీ నుంచి వస్తూవస్తూనే "ఒరేయ్ చూడు ఒక వార్త వచ్చింది." అంటూ నిర్లక్ష్యంగా నేను కూర్చున్న సోఫామీదికి గిరాటు పెట్టాడు. నన్ను 'ఒరేయ్' అని పిలవటం నాకే మాత్రం ఇష్టం లేదు. వద్దంటే మా నాన్న వినడు. ఆయనకట్లా పిలవాలని సరదాట. పిలవమన్నాను. కాని నాకయితే ఎబ్బెట్టుగానే వుంటుంది. ఎవరైనా విన్నవాళ్లు కూడా యేమిటా పిలుపు అనుకుంటారేమోనని నాకు చాలా బిడియంగా వుంటుంది. పదిమందిలో కూడా అదే పిలుపు, అదేవరస. అలవాటయిన వాళ్ళకు అదేమి పట్టింపుగా వుండదు. ఏమైనా గాని ఆకవరు అట్లా గిరాటు పెట్టేటప్పుడు నేను ఆయన మొహంలోకి సూటిగా చూశాను. మోహంలో సంతోషం, విచారం, రెండూ మిశ్రమంగా నా రెండు కళ్ళకూ కనిపించినాయి. నేను మెల్లిగా తల వంచుకుని ఆ కవరును చూసాను. అదే డైవోర్స్ నోటీస్. దాంట్లో అంతా ఆశ్చర్యంగానేవుంది. నాకవుతే యిప్పుడు ప్రతిమాట గుర్తురావడం లేదుగాని ముఖ్యంగా మా నాన్న అమ్మని చిత్రహింస పెడుతున్నాడని, తాగివచ్చి చావ బాదుతున్నాడని, మా నాన్నకు యింకో ఆడదానితో అక్రమ సంబంధం వుందని యింకా ఏమేమో రాశారు. దాంట్లో ఓ చిన్న నిజం వుంది. మా నాన్న అప్పుడప్పుడు తాగుతాడు. కాని

తాగి వచ్చినట్లుగా కనబడడు. ఆయన మాటల్ని బట్టి ధోరణిని బట్టి ఆయన తాగాడని ఎవరూ అనుకోవటానికి వీల్లేదు. మిగతావి నాకు తెలిసినంత వరకు అన్నీ అబద్ధాలే. మళ్ళీ నేను పస్తా యిస్తున్నాను. తల్లిని గూర్చి నేను చెడుగా అనవచ్చునో అనగూడదో, ఏమైనాగాని నిజం చెప్పటంలో తప్పేమీ లేదు. దాంట్లో రాసిన వాటిల్లో అన్నీ మా అమ్మకు వర్తించాయంటే అబద్ధమేంకాదు. మా నాన్నను యెన్నెన్ని మాటలందో, యెంతెంత హింస పెట్టిందో, కళ్ళారా నేను చూచిన దాన్ని దీంట్లో అసత్యమేమీ లేదు. అవన్నీ మా నాన్నకు అంటకట్టింది. ఇంకో పెద్ద రహస్యం వుంది. అది యింకా మా నాన్నకూ్కడా చెప్పలేదు. ఎట్లా చెప్పటం! ఏమని చెప్పటం! అందు కనే మెదలకుండా వూరుకున్నా. కొన్ని కొన్ని చెప్పకపోవటమేమంచిదేమో! చెప్పితే అపకారము, అపచారము చేసిన దాన్నవుతానేమో! నిజానికి నాకు చెప్పే పద్ధతి తెలియక మెదలకుండా వూరుకున్నా. నాకయితే చెప్పాలనే వుంది.

ఇందాక నేనన్నాకదూ, ఆరెండో బెడ్‌రూమ్‌కు వెళ్ళాలంటే భయంగా వుందని. ఎందుకో ఇప్పుడు చెబుతాను. ఆ నాడు నేను, మా నాన్న కలిసి పిక్‌నిక్ వెళ్ళదామని బయలు దేరాము. మళ్ళీ మేం వచ్చేటప్పటికి రాత్రి ఏడు గంటలు కావచ్చునని చెప్పాము. పదిగంటలకల్లా కార్లో కూర్చున్నాం. మాతోపాటు ఇంకా స్టూడెంట్స్ కొంతమంది వచ్చారు. సరిగ్గా మేము గేటు దాటా మోలేదో,ఎదురుగా ఓ కారొచ్చి ఆగింది.మా నాన్న కారువేపుచూశాడు. లెక్చరర్ స్వామినాథన్ హఠాత్తుగా గుండెపోటు వలన మరణించాడు, అని కబురొచ్చింది. హార్ట్ ఎటాక్ పాపం అనుకున్నాను. నాకీ మధ్యనే స్వామి నాథన్ గారితో పరిచయం చేశాడు మాడాడీ. ఆయన చాలా సరదామనిషి. హాయిగా నవ్వుతాడు, నవ్విస్తాడు. మంచి సరసుడు. ఆయన నోటివెంబడి ఏ మాట వచ్చినా మేమంతా విరగబడి నవ్వేవాళ్ళం. పాపం ఆయనకు ఇంత

ఘోరం జరిగిందా అనుకున్నాం. సూటిగా మేము ఆయన ఇంటికి వెళ్ళాం. స్వామినాథన్ భార్య స్పృహ తప్పి పడిపోయింది. చిన్న పిల్లలు ఇద్దరూ వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. ఎందుకు ఏడుస్తున్నారో వాళ్ళకే తెలియటం లేదు. మేము మధ్యాహ్నం దాకా అక్కడే వుండిపోయాము. పిక్‌నిక్ ఆనాడు అట్టే అయిపోయింది. మా నాన్న "మనస్సు బాగా లేదురా, నేను క్లబ్బుకు వెళ్ళొస్తాను" అంటూ ఆయన అటు వెళ్ళంగానే నేను సూటిగా యింటికి వచ్చేశాను. మెల్లిగా అడుగుల్లో అడుగు వేసుకుంటూ గుమ్మం దగ్గర నిలబడి కాలింగ్ బెల్ మీదే వేలు పెట్టబోతూ మళ్ళీ వెనక్కు తగ్గాను. మెల్లిగా దొడ్డివైపు వెళ్ళి అక్కడ నాకిష్టమైన గులాబి మొగ్గల్ని చూద్దామనుకున్నాను. ఇప్పుడు లోపలికి వెళ్ళంగానే అమ్మ ఏదో ప్రశ్న వేస్తుంది. యీ చావు కబురు నేను చెప్పాలి. అని మనస్సులో అనుకున్నాను. ఆతోటలో చుట్టూ తిరుగుతూ ఎంతసేపయినా కాలక్షేపం చెయ్యగలను. అందుకనే అటు బయలుదేరాను. తీరా నేను మలుపు తిరగంగానే రెండో బెడ్ రూమ్ దగ్గిర కిటికీలోంచి గుస గుసలు వినిపించినాయి. చప్పున ఆగేశాను. మా అమ్మ మాటలు నాకు స్పష్టంగా వినబడ్డాయి–"నేను నీతోనే వచ్చేస్తాను"అనే మాట మాత్రం చాలా రోజులదాకా మా అమ్మను చూసినప్పుడల్లా అవిడంటున్నట్టే అనిపించేది. అవతలతని గొంతుక నాకు పూర్తిగా కొత్తదే. ఎవరో తెలీటం లేదు.షుమారు పది నిమిషాలదాకా అట్లాగే వింటున్నాను. ఏవేవో మాటలు కొన్ని పూర్తిగా వినిపించలేదు. తరువాత చప్పున మాటలు నిలిచిపోయాయి. నిశ్శబ్దం ఆవరించుకుంది. నేనట్లాగే నిలబడ్డాను. అతనెవరో వెళ్ళిపోయి వుంటాడనుకున్నాను. అమ్మ లోపలికి వెళ్ళి పోయిందని అనుకొని నేను ఓ అడుగు ముందుకు వేసానో లేదో 'అమ్మయ్య' అని పెద్ద నిట్టూర్పు శబ్దం నా చెవిన పడింది. కుతూహలం కొద్దీ కొంచెం పైకి ఎగిరి కిటికీ సందుల్లోంచి లోపలికి ధైర్యంగా చూసాను. చప్పున క్రిందికి దిగి రెండు చేతు

లోను కళ్ళు మూసుకుని గబగబ వీధిలోకి పరిగెత్తాను. మళ్ళీ సాయంత్రం నాన్నతో పాటే యింటికి వచ్చేశాను. నేను ఆనాడు చూసింది జీవితంలో మరచిపోలేను. నాకు తెలియకుండానే నామనస్సు మీద యెంతో ప్రగాఢంగా ఒక పెద్ద ముద్రలాంటిది పడిపోయింది. అది చెరగలేదు. ఎన్నటికీ కూడా చెరగదేమోనని కూడా నా ఉద్దేశం. ఈ విషయం మానాన్నతో చెప్పలేదు. నేను ఆ నాడు ఆ కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డట్టు మా అమ్మకు తెలీదు. తెలిసే అవకాశం లేదు.

ఇప్పుడు డైవోర్సు నోటీసు తర్వాత కోర్టునుంచి సమ్మన్స్, కేసు నడవటం ఇవన్నీ జరుగుతుంటే కూడా నేను నోరుమూసుకొని వుండిపోయాను. నేనేమీ అనలేకపోయాను. సాక్ష్యం యివ్వలేకపోయాను. నిజం చెప్పలేకపోయాను. ఒక నిర్దోషి నిర్దాక్షిణ్యంగా నిందితుడు అని రుజువయిపోతుంటే కూడా యేమి చెయ్యలేకపోయాను. మానాన్నని నలుగురూ అంటుంటేకూడా నేనేమి మాట్లాడలేదు. లోపల లోపల ఎంతో యేడ్చాను. మోహం పీక్కున్నాను. తల బాదుకున్నాను. ఇదేనాకు శిక్ష అనుకున్నాను. అంతే. మానాన్న ఒక్కమాట అనలేదు. అన్నింటికీ ఒప్పుకున్నాడు. చివ్వరకు నాకు చెప్పాడు. నిజం ఏవ్వరికి కావాలిరా ? ఎవరికీ అక్కర్లేదు. నిజం చెప్పు అని గొగ్గోలు పెడతారేగాని, నిజంగా నిజం చెప్పితే యీలోకం నిలుస్తుందంటవా! అన్నీ దగాకోర్టులే, అన్నీ మోసాలే, అన్నీ అసత్యాలే ! అయితే నాక్కావల్సింది నాకు దొరికింది. ఈ అబద్ధాల వలన నాకు డైవోర్సు వచ్చింది. ఇది నా స్వార్థం, అన్నాడు ! ఆయనకదే సంతోషం.

"నీకేం భయం లేదురా ! నేనున్నంత వరకూ నీకేమేం చేస్తానో చూస్తూవుండు, నీ యిష్టం వచ్చినట్లుండు, నీకేది కావాలంటే అది అడుగు. నీకునేను తల్లిని,తండ్రిని" గద్గదకంగా అన్నాడు. నాకళ్ళు చెమ్మగిల్లినాయి.

తర్వాత తర్వాత అన్నీ క్రమక్రమంగా మరచి పోయినా, ఆనాడు తోటలో నిలబడి ఆ కిటికిలోంచి నేచూసింది మాత్రం నన్ను వెంటాడుతునే వుంది. నాకు యేమేమిటో ఆలోచనలు వచ్చి యిట్టే విచ్చిపోతూ వుంటాయి. ఏదీ గట్టిగా నిలవటం లేదు. ఏదీ గట్టిగా ఆలోచించటం లేదు. నాకేదో కావాలనిపిస్తుంది గాని యేది కావాలో తెలీటంలేదు. ఏంకోరుకోవాలో అర్థం కావటంలేదు.

నాకు డ్రస్ మార్చటం అంటే మహాసరదా. నిమిషానికి ఒక డ్రస్సు వేసుకోవాలన్నా నాకు విసుగు పుట్టదు. మా నాన్న నాకు బోలెడన్ని వెరైటీస్ తెచ్చి పెట్టాడు. అందులోని బిర్రులాగు తొడుక్కునిపూర్తిగా నిండుగా గౌను వేసుకోవటం అంటే నాకుమహాసరదా. ఓనాడు ఆ డ్రస్సుతోనే హాలులో కూర్చుని యేమేమిటో హాయిగా పాడుకుంటున్నాను. సాయంత్రం అయిదయినట్లేనాకు తెలీలేదు. అమాంతం మానాన్న, నలుగురైదుగురుస్టూడెంట్సు వచ్చారు, వీధితలుపులు తెరుచుకుని. నేను నివ్వెరపోతూ నిలబడిపోయాను. ఆ వచ్చిన వాళ్ళు నలుగురు నా వైపు అదోరకంగా చూసారు. మా నాన్న వాళ్ళను లోపలికి తీసుకువచ్చి నాకు పరిచయం చేసాడు. నలుగురూ నాలుగు రకాలుగా కనిపించారు. అందరూకూడా నాకళ్ళకు తమాషాగా కనబడ్డారు. వాళ్ళతో నాకు మాట్లాడాలనిపించలేదు. నేను మెదలకుండా కూర్చున్నాను. వాళ్ళే యేదో పలకరించాలన్నట్టు నాతో సంభాషణలు మొదలు పెట్టారు. నేను ముక్తసరిగా మాట్లాడుతుంటే మా నాన్నే నన్ను కొంచెం విసుక్కున్నట్టుగా మాట్లాడాడు. మనింటికి గెస్ట్సు వస్తే యిదేనా రిసెప్షన్ అన్నాడు. నేను నవ్వి వూరు కున్నాను. అయితే మా నాన్న నన్నేమి అనడు. చాలా మంచివాడు. నా మనస్సుకు యిష్టం లేని పని ఆయన చెయ్యడు. నన్నుచెయ్యమనడు. ఆయన గొప్ప లక్షణాలలో అదొకటి. మొదటి నుంచి కూడా జీవితం మీద వ్యాఖ్యానం చెయ్యటం వేదాంతంగా

మాట్లాడటం చెప్పిందే చెప్పటం ఇది ఆయనకు బాగా అలవాటు. బహుశ కాలేజీ లెక్చరర్లకు వుండే అలవాటేమో నాకు తెలీదు. మా నాన్న అంటు న్నాడుగదా అని నేనుకూడా వాళ్ళతో యేదో మాట్లాడటం మొదలుపెట్టాను. వాళ్ళ నలుగ్గురు చాలా ఆసక్తిగా నే నేమంటున్నా అవును, నిజమే, మీరు చెప్పింది చాలా బాగుంది అంటూ పొగిడేస్తున్నారు. నాకు నిజానికి పొగడ్త లంటే ఇష్టం లేదు. నన్ను పొగడే వాళ్ళను చూస్తే నాకు అసహ్యం కూడా. ఈ సంగతి వాళ్ళకు తెలీదుగా. ఎవరికివారు నాకు సన్నిహితంగా వుండా లన్నట్టు నాతోచనువుగా మాట్లాడాలన్నట్టు ప్రయత్నం చేస్తున్నట్లు నేను కని పెట్టాను. అయితే నేను నింపాదిగా వుండిపోయాను. నా మనస్సు వాళ్ళకేమిటో తెలియ నివ్వలేదు. చాలా సేపు అట్లాగే మాట్లాడుకున్నాం. నవ్వుకున్నాం. ఒకర్నొకరు ఎగతాళికూడా చేసుకున్నాం. దాంతో ఆ నాటి పరిచయం అట్లా ముగిసి పోయింది.

మా నాన్న చాలా చాలా నాకేవేవో చెప్పాడు. ఆయనంత యిదిగా చెప్పటానికి కారణం యేమిటో నేను తెలుసుకుంటానని ఆయనకు నామీద విశ్వాసం. అలాంటి నమ్మకాన్ని నేను వృథా చెయ్యలేదు. నా పెళ్ళివిషయం, నా భవిష్యత్తు విషయం ఆయన మెదడులో మసలుతూ వుంటుంది. అందుకనే నాకు అంతగా చెప్పటం. నాకు అప్పట్లో పెళ్ళిమీదికి దృష్టి పోలేదు. ఎన్ని చెప్పినా ఊఁ ఊఁ కొట్టటమే కాని మా నాన్న చెప్పిన విషయాలను సీరి యస్‌గా వింటంగాని ఆలోచించటంగాని జరగ లేదు. నీ మనస్సుకు యేది యిష్టమని తోస్తే అదే చెయ్యి, నాకేమీ అబ్జక్షన్ లేదు. నీకు బుద్ధి పుడుతే ముందుగా నాకు చెప్పు, నేను సంతోషిస్తా అన్నాడు. ఈ మాటలు బాగా నచ్చినాయి. కాని ముందుగా చెప్పమంటం మాత్రం యేమీ బాగా లేదు. అసలు నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి. నాకేమీ అభ్యంతరం లేదనే మాట యివ్వాల్టి మాట కాదు. ఎప్పటినుంచో అంటున్న ముక్కే, అసలీ మాటకే

మాఅమ్మ ఎక్కువగా అహంకారపడేది. మానాన్నను కోప్పడేది. నా యిష్టం వచ్చినట్టు చెయ్యమంటున్నాడు కాని, నాయిష్టం ఏమిటో నాకే తెలీటంలేదు. ఏం చెయ్యాలి ఎట్లావుండాలి. భవిష్యత్తులో నాకు కావాల్సిందేమిటి ? ఇవన్నీ ఆలోచిస్తున్నా నన్న మాటేగాని, నా మనస్సుకు ఫలానా అని తట్టటం లేదు. ఇప్పుడిప్పుడే నాకు ఒంటరిగా అంతపెద్ద ఇంట్లో వుండాలంటే ఏమిటోగా అనిపిస్తున్నది. నాతో మాట్లాడుతూ నన్ను పలకరిస్తూ నన్ను సంతోష పెడుతూ తోడునీడగా ఒకరు నాతోవుంటే బాగా వుంటుందని మాత్రం అని వుంది. అట్లా ఎవరుంటారు? ఎవర్ని యెన్నుకోవాలి. ఇది పెద్ద సమస్యే. మా నాన్న పరిచయంచేసిన తరువాత ఆ స్టూడెంట్స్‌లో ఒకతనుమాత్రం తరుచు నాకు ఎక్కడో కలుస్తూనే వున్నాడు. నన్ను చూడంగానే యింత మొహం చేసుకుని నవ్వుతూ గుడ్ యీవినింగ్, గుడ్ యీవినింగ్ అంటూవుంటాడు. నేనూ అట్లాగే విష్ చేస్తాను. ఏవో నాలుగు మాటలు మాట్లాడి వెళ్ళిపోతూ వుంటాం. అతనిలో యేదో పెద్ద ఆకాంక్షవున్నట్టు నాకనిపిస్తూ వుంటుంది. మొదట్లో అయితే అతను కనిపించగానే చప్పున నేనుకూడా గుడ్‌మార్నింగ్ అని విష్ చేసేదాన్ని. అయితే తర్వాత తర్వాత అతను కనిపిస్తే నాకు మాత్రం భయం వేసేది. తలెత్తి చూసేదాన్ని కాదు. నన్ను పలకరిస్తా డేమోనని తప్పించుకు తిరిగినట్టు వెళ్ళిపోయేదాన్ని. అయితే అదంత నాకు సహజంగా వున్న సిగ్గు, బిడియం అనుకున్నాడో యేమో, మళ్ళీ మళ్ళీ సమయం వచ్చినప్పుడల్లా నాతో మాట్లాడుతునే వున్నాడు. అయితే నా మనస్సేమి మారలేదు.

మా నాన్న ఓ నాడు హఠాత్తుగా ఓ దూరపు బంధువట, ఆయన్ను తీసుకొచ్చి మా యింట్లో మూడురోజుల పాటుంచాడు. ఆయన ఆ మూడు రోజులు నన్ను వదలి పెట్టలేదు, ప్రతి నిముషం నా వెంట వున్నట్టే తోచింది. నన్ను ఎన్నెన్నో విషయాలు అడిగాడు. అన్నింటికి విసుగూ,

విరామం లేకుండా సమాధానాలు చెప్పాను. మీ అమ్మాయి చాలా తెలివి కలదే అని వ్యాఖ్యానించాడు. అసలు నా వయస్సుకు మించిన ఆలోచనలు, తెలివి తేటలు వున్నాయని నా సర్కిల్స్‌లో నాకు పెద్ద పేరు. అది నిజమో అబద్ధమో తెలీదు. అయితే ఏ విషయాన్నైనా నిశితంగా విమర్శించటం, యిట్టే అర్థం చేసుకొవటం. ఎవరైనా ఏదైనా ప్రశ్న వేస్తే తడుముకో కుండా సమయస్ఫూర్తిగా సమాధానం చెప్పటం నాకు మొదటి నుంచి అల వాటే. ఇవన్నీ మా నాన్న పోలికలు అని అంటారు. అందులో ఆ వచ్చిన దూరపు బంధువు యించు మించు మా నాన్న వయస్సులో వుంటాడు. ఎంతో ఆప్యాయంగానూ, ప్రేమగానూ, మాట్లాడాడు. నేను అంతే. వాళ్ళిద్దరూ యేమను కున్నారో యేమో ఒక నాడు అమాంతం అయనగారి కుమారుడట వచ్చిపడ్డాడు. మానాన్న అతనితో పరిచయం చేసాడు.దర్జాగా నిలబడి "హౌ ఆర్ యూ" అంటూ నావైపు చెయ్యిజాచి 'షెక్‌హాండ్' కోసంగామాలు నా కళ్ళలోకి చూశాడు. నాకు చాలా ఎబ్బెట్టనిపించింది. నాకు అది అంతగా నచ్చలేదు. అసలు ఆ అబ్బాయి అట్లా ప్రవర్తించటం నాకే మాత్రం యిష్టం లేదు. ఎవరో కొత్త అమ్మాయిని తాకాలనే ఆతని వుద్దేశ్యం నాకేమీ అర్థంకాలేదు. ఆ సమయంలో నా మనస్సులోకి ఏ మొచ్చిందో యేమో నేను మెదల కుండా నిలబడిపోయాను. మాటాపలుకూ లేదు. మానాన్న ఆయనా ఒకరి మొహం ఒకరు, క్షణం చూసుకొని నవ్వు కున్నారు. ఇంకేం మా అమ్మాయి మన ఆచారాల్లోనే వుంది, అని గట్టిగా నవ్వేశాడు. ఇదొక ఇన్‌సిడెంట్ మాత్రమే. ఇలాంటివి, ఇంకా రకరకాల తమాషాలు నా జీవితంలో చాలా జరిగినాయి. వీటికంతా కారణం మా నాన్నే. నా మనస్సు సంతోషపెట్టాలని నాకు నచ్చిన వ్యక్తిని నేను ఎన్నుకో వాలని ఆయన తాపత్రయం. అందుకనే యిలాంటి ట్రయల్స్ వేస్తూ వుంటాడు. మంచి మంచి వాళ్ళు, మంచి కుటుంబంలోని వాళ్ళు మా బంధు

పుల్లోను ఎంతో మందితో పరిచయం అయింది. వాళ్ళల్లో ఎవరైనాసరే నేను ఊఁ అంటే నాకెప్పుడో పెళ్ళి అయిపోయేదే. కాని నేను నిర్ణయం తీసుకో లేదు. తీసుకో లేకుండా వున్నాను. నాకు ఎలాంటి వ్యక్తికావాలో, అతను ఎట్లా వుండాలో, ఏవిధంగా ప్రవర్తించాలో నాకే తెలీటం లేదు. అయితే నాతో పరిచయం, అయిన వాళ్ళల్లో యెవర్నీ కూడా నేను ఆకర్షించలేక పోయాను. వాళ్ళందరూ కూడా చాలా మంచి వాళ్ళు, మర్యాదస్తులు, సంఘంలో గౌరవం ప్రతిష్ఠ వున్న వాళ్ళు, డబ్బున్న వాళ్ళూనూ, కాని వారెవ్వరూకూడా నా కంటికి ఆనలేదు. కారణం ఏమిటని అడిగితే నేను చెప్పలేను. నాకేం కావాలో నాకే తెలియని పరిస్థితి వచ్చేసింది. అలాం టప్పుడు మానాన్నకు ఏమని చెపుతాను. ఆ ప్రశ్న ఎన్ని సార్లు వేసినా నాకేం అక్కర్లేదు, అని సమాధానం చెప్పాల్సి వస్తోంది. నిజంగా అదినాకు బాధగానే వుంది. మానాన్న నన్ను గురించి ఇంత ఆవేదన పడుతుంటే నేను ఒక్క ముక్క చెప్పలేక పోవటం కూడా తప్పే! మరి నన్నేంచేయ మంటారు. నాకేమి తోచడం లేదు. నా మనస్సు యెటువైపు వెళ్ళటంలేదే. మా అమ్మ, తమ్ముడు దూరమై పోయారని కొత్తల్లో బెంగగాను, దిగులు గాను వున్నా యిప్పుడు ఆ విషయమే మరిచిపోయినట్లయిపోయింది. ఇప్పు డిప్పుడే నాకు తోడుగా యెవరైనావుంటే బాగుంటుందని అనుకుంటున్నాను. నాకు యెవరి మీద ధ్యాసపోవటం లేదు. మానాన్న బిత్తరపోయి చూస్తాడు. ఆయన చాల ఆందోళనగా వున్నట్లు నాకు అనిపిస్తోంది. నాకు నచ్చిన అబ్బాయి కనిపించక పోవటం దురదృష్టమే! ఏమయినా అది అంతే.

ఇట్లా రోజులు తమాషాగా గడిచి పోతున్నాయి. నాలో మార్పేమీ రావటంలేదు. కాని రోజు రోజుకు నాకు ఒంటరిగా ఆయింట్లో వుండాలంటే మాత్రం కష్టంగానే వుంటోంది. ఒంటరిగా అంటే నాకు అండగా నాతో పాటు వుంటూ నా మనస్సుకు నచ్చినట్టు ప్రవర్తిస్తూ

వుండి పోయే వ్యక్తి కావాలి. ప్రత్యేకంగా పెళ్ళి చేసుకోవాలనికూడా నాకు కలగటం లేదు. అయితే యీ ఆలోచన వింతగానే వుంది. నాకే అనిపిస్తోంది. ఏమిటీ కోరిక? అని మానాన్న పొద్దున్నే కాలేజీకివెళితే యెప్పుడో వస్తాడు వంటమనిషి అయితే దానిష్టం వచ్చిన్నాడు వస్తుంది. లేనినాడు లేదు. ఇహ అంత యింట్లోనూ నేను ఒంటరిగా వుంటున్నట్టేగా.

ఆ నాడు మా నాన్న నన్ను నిలవదీసి అడిగాడు. చదువుకోమంటే యిష్టం లేదంటావు. నేను యెంతో మందితో పరిచయం చేసి నిన్ను సంతోష పెడదామని అనుకుంటుంటే నువ్వు ఎవ్వరి విషయంలో కూడా ఏ శ్రద్ధా ( ఇంటరెస్టు ) చూపించవు, నీమనస్సేమిటో అర్థం కావటం లేదు అన్నాడు. నన్నేం చెప్పమంటావు, నాకే తెలియటం లేదు అన్నాను. ఏమీ ఆలోచించకుండానే. ఈ సమాధానం మరీ స్ట్రేంజ్‌గా వుంది అని నవ్వాడు. నాకూ అట్లాగే వుంది డాడీ అన్నాను. ఆయనేమీ మాట్లాడ లేదు.

రానురాను నా మనస్సులో ఏదో ఆరాటం,ఆవేశం చెలరేగుతున్నాయి. ఒక్కచోట కూర్చోబుద్ధి పుట్టదు. పుస్తకం తియ్యంగానే విసిరికొట్టెయ్యాలని పిస్తుంది. రికార్డు తిరుగుతూ వుంటే సగంలో ఆపేస్తాను. ఎవరో ఏదో ఉద్బోధిస్తున్నట్లు ఎవరో తరుముకొస్తున్నట్టుగా అనిపిస్తుంది. అర్ధరాత్రి వేళ అమాంతం మెళకువ వచ్చినపుడు మంచం మీద కూచుని వుంటాను.

ఒక్కొక్కప్పుడు అసలే నిద్ర పట్టదు మా నాన్న గుడ్‌నైట్ అని తన గదిలోకి వెళ్ళిపోతాడు. నేను పరుపు మీద అటూ యిటూ వత్తిగిల్లుతూ నానా అవస్థ పడుతూ వుంటాను. మా నాన్న గురక పెద్దగా వినిపిస్తూ వుంటుంది. ఒక్కొక్క రాత్రి అయితే ఆ గురక వింటూనే మంచం మీద కూచుని వుంటాను. ఈ మధ్యనే మా అమ్మ మాటి మాటికి గుర్తు రావటం మొదలు పెట్టింది. ఆమె జీవితం, మనస్తత్వం తలుచుకుంటే ఒక్కొ-

ఒక్కొక్కప్పుడు మహా కోపం వస్తుంది. మళ్ళీ జాలేస్తుంది. పాపం ఆమె ఏమి సుఖపడుతోంది. మేమిద్దరం యిక్కడ వున్నాం, వాళ్ళిద్దరూ అక్కడ వున్నారు. డబ్బుంది, పిల్లలున్నారు. భర్త మంచి ఉద్యోగస్థుడు, ఇల్లు వాకిలి వుంది. అన్నీ వున్నాయి. ఆడదానికి కావలసినవన్నీ వున్నాయి. ఆ మాటకొస్తే ఆడేమిటి మగేమిటి, మనిషికి కావలసిన సదుపాయాలు (ఫెసిలిటీస్) అన్నీ వున్నాయి. కాని మా అమ్మ వీటిని వుపయోగించుకో లేకపోయింది. చేతులారా జీవితాన్ని నాశనం చేసుకుంది. తాను తీవ్రంగా దుఃఖపడుతూ యితరులను దుఃఖపెట్టింది. దీంట్లో తాను బావుకుందేమీలేదు. అయినా అట్లా చెయ్యటంలో గల కారణం యేమిటి ? ఎవ్వరూ ఏమీ చెప్ప లేరు. ఒక్కొక్కళ్ళు చేతులారా కష్టాల్ని తెచ్చుకుంటారు. తన మనస్సును నాశనం చేసుకునే యితరుల మనస్సును నొప్పిస్తారు. ఇలాంటి తరగతులల్లో చెందినామే మా అమ్మ. ఒకాయిన రాశాడు, మనవాళ్ళు యెట్లా దుఃఖ పడాలా యితరులను యెట్లా పీడించాలా అనే ఆలోచిస్తారు కాని ఉన్నదాంట్లో యెట్లా సుఖపడాలా అనే ఆలోచనే పోదని. నిజంగా అక్ష రాలా అమ్మ విషయంలో అది నిజమే. కీర్తిశేషులు పాడిన "మనసు గతి యింతే" అనేపాట నాకు మాటిమాటికిగుర్తుకొస్తుంది, మా అమ్మను తలుచు కున్నప్పుడల్లా. అయినా అమెగారు యిప్పుడెందుకు గుర్తుకొస్తోందో నే చెప్పలేను. నిజం చెప్పాలంటే ఆమె మీద నా కేమాత్రం మమకారం లేదు. అమెను చూడాలని కోరికా లేదు. ఆసంగతి మరచి పోదామనే ప్రయత్ని స్తున్నా, కాని నాకు సాధ్య పడటం లేదు.

ఈ మధ్యలో చిన్న చిన్న సంఘటనలు యెన్నో జరిగినాయి. నిజా నికి ప్రతివాని జీవితంలో నిత్యకృత్యంలో యెన్నో సంఘటనలు ఒడుదుడు కులు జరుగుతూనే వుంటాయి. వాటి కేమాత్రం ప్రాముఖ్యం వుండదు. అవి చెప్పుకో దగినవిగా వుండవు. అయితే ఒక్కొక్కప్పుడు ఒక్క చిన్న

సంఘటన మనస్సు మీద చెరగిన ముద్రవేస్తుంది ! అలాంటి దొకటి యీ మధ్యనే జరిగింది. కాలేజీ నుంచి యెవరో ఒక అతను లోపలికి వచ్చేశాడు. మీ ఫాదర్ మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు అన్నాడు. అప్పటికి సాయంత్రం అయిదు దాటింది. నేను కూడ మాటాడ లేదు. ఉన్న దాన్ని ఉన్న పళంగా బయలుదేరి ఆ కారులో కూచున్నాను. అతనే డ్రైవ్ చేస్తున్నాడు. తలవంచుకుని కూర్చోవటం చేతేమో కారు యెక్కడి కెడుతున్నదీ గమనించలేదు. చప్పున ఓ జర్కు యిచ్చి యిట్టే ఆగేటప్పటికి యీ ప్రపంచంలోకి పడ్డాను. చుట్టు ప్రక్కల చూసేటప్పటికి అంతా సముద్రం, నాగుండె గుభేలుమంది. ఇదేమిటి యిక్కడికితెచ్చావు, అన్నాను గాభరాగా.

మేడమ్ భయపడ వద్దు. నేను మీతో ప్రయివేటుగా మాట్లాడాలని వచ్చా, అన్నాడు. సముద్రపు హోరు మహా భయంకరంగా వినిపిస్తోంది. ఈ బీచ్‌కు యెన్నిసార్లు వచ్చానో యెన్ని గంటలు గడిపేసానో అంతు లేదు. ఎప్పుడూ సముద్రాన్ని చూస్తే నాకు భయం వేసేది కాదు. కాని ఆ అలలు ఉవ్వెత్తున లేచి మళ్ళీ ఫెళ్ళున కింద పడిపోతుంటే, అవ్వొచ్చి నామీద పడుతున్నట్టుగానే భయపడిపోయాను. ఆ సముద్రం కంటె యితన్ని చూస్తుంటే మరీ భయంగా వుంది. ఒక మగవాడు వంటరిగా నాతో మాట్లాడే విషయ మేమిటో నేను ఊహించలేని అశక్తతలో లేను, కాని అతని సాహసం యేమిటో అర్థం కావటం లేదు. అది వరకెప్పుడూ అతనిని చూసినట్టు గుర్తు రావటంలేదు. కానీ తీరాపరీక్షగా చూస్తేమాత్రం ఎక్కడో ఎప్పుడో చూసినట్టుగానే అనిపించింది. ధైర్యాన్ని పుంజుకుని చప్పున కార్లోంచి బైటికొచ్చాను. అతనూ వచ్చి నా యెదురుగా నిలబడ్డాడు. అక్కడ జనసంచారం అట్టే లేదు. అ సమయానికి ఆ బీచ్‌కు చాలా మంది రావాల్సిందే. వస్తున్నారు కూడా. అయితే మాకు కొంచెం దూరంలోనే వున్నారు.

'ఐ లవ్‌యు వెరీ మచ్!...' అంటూ ఆయాసపడుతూ నా చెయ్యి పట్టుకున్నాడు. నా ఒళ్ళు ఝల్లుమంది. ఇట్టే చూసి చెయ్యి విదిలించే శాను. నేనూ బాగా ఉద్రేక పడ్డమాట నిజమే! కాని అతనంటే నాకిష్టంలేదు.

"యూ స్టుపిడ్, ..." అంటూ గట్టిగా అరిచాను. అతనికి భయం వేసి నట్టుంది. అటూ యిటూగాభరాగా చూసి రండి మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను అన్నాడు. నేను వెళ్ళి మెదలకుండా కూచున్నాను. బర్ అంటూ కారు మెలికలు తిరిగింది. ఇట్టే యింటికి వచ్చేశాం. అతనే దిగి డోర్ తీసి చాలా ప్రాథేయ పడుతున్నట్టు "ఎక్స్‌క్యూజ్ మీ మేడమ్" అన్నాడు. అతని వంక కూడా చూడకుండా లోపలికి వెళ్ళి పోయాను. ఏమిటిది కలా నిజమా! ఎవరో మగవాడు నన్ను కార్లో తీసుకు పోయి నేను గదమాయించంగానే గబ గబ తీసుకొచ్చి యింట్లో దిగవిడిచి వెళ్ళాడు. ఇది జరిగే పనా! అతనే యేదైనా అఘాయిత్యం చేస్తే నా గతే మయ్యేది. ఎవ్వరో తెలుసుకోకుండా నేను ఒంటరిగా అతనితో వెళ్ళట మేమిటి? తలుచుకుంటే అంతా ఆశ్చర్యకరంగా వుంది. అంత కంటే ఆశ్చర్యం అతని ప్రవర్తన! అతని పిరికి తనం, అమాయకత్వం చూస్తుంటే నాకు పొట్టచెక్కలయ్యేటట్టు నవ్వొచ్చింది. అది తలుచు కుంటూ నాలో నేను చాలాసేపటి దాకా నవ్వు కుంటూనే వున్నాను. పిరికి వాళ్ళని చూస్తే నాకు చెడ్డ అసహ్యం. నాకు ఆ సంఘటన మాత్రం అప్పు డప్పుడు జ్ఞాపకొస్తుంది. అ మనిషి నవుతే నేను మరిచే పోయాను. కాని ఆనాడు అతను నా చెయ్యి పట్టుకోవటం మాత్రం మరవ లేకుండా వున్నా.

రోజు రోజుకు నా మనస్సు విలవిలలాడి పోతోంది. అలసటగానూ ఒళ్ళువిరుపుగానూ, విసుగుగానూ,మహాచిరాకుగానూ వుంటోంది. మానాన్న నన్ను ఒకటి రెండుసార్లు "ఆర్ యూ ఆల్ రైట్" అనిఅడుగుతూ వచ్చాడు.

ఐ యామ్ ఫైన్ అంటూ పైకి జవాబు చెప్పేశాను.

ఆనాడు మానాన్న రోజూ వచ్చేటైము దాటిపోయింది. సాయంత్రం అయిదున్నరకు రాకపోతే యిహక్లబ్బుకు వెళ్ళినట్టు ఊహించుకోవాల్సిందే. వంట మనిషి వచ్చి పని పూర్తి చేసుకొని ఏడున్నరకే వెళ్ళి పోయింది. వంట నాకేదో ఆలోచన వస్తోంది. మళ్లీపోయింది. మనసు ఎంతో ఉల్లాసంగానూ హాయిగానూ వుంది. నాన్నగారు రాగానే ఏమిటో చెబుదా మనుకున్నాను. మాటి మాటికి టైము చూసుకుంటున్నాను. ఎనిమిదిన్నరయింది ఇహ ఆయన వచ్చే వేళయింది, అనుకుంటున్నాను. ఇంతలోకి బెల్ మోగింది. సంతోషం పట్టలేక పోయాను. అమాంతం ఒక్క అంగలో డోర్ దగ్గరకు వెళ్ళి హండిల్ తిప్పేసి తలుపు తెరిచి "డాడీ" అంటూ ఆ వేశంగా అన్నాను. కాని ఎదురుగా మా నాన్న లేడు. ఎవరో, ఒక వ్యక్తి నిటారుగా నిలబడ్డాడు. నే నట్లాగే ఆగిపోయాను, అతని మొహం లోకి చూస్తూ. పెద్ద వెడల్పాటి మొహం, వత్తుగా కను బొమ్మలు, పెద్ద పెద్ద కళ్ళు, కొరమీసం, మాంచి గిరజాల జుట్టు. ఆరడుగుల యెత్తు. ఆ పొడుగాటి ముక్కును కళ్ళను చూస్తూ నాలో నేను ఆశ్చర్య పోయాను. మెకప్ వేసుకున్న అమితాబ్ బచన్ లాగా వున్నాడు. నా కళ్ళు అతని కళ్ళ దగ్గర్నుంచి విడిపడటం లేదు. అట్లాగే చూడ బుద్ధి పుట్టింది. ఎవరు మీరు? ఎవరి కోసం వచ్చారు ? ఏంకావాలి ? లోపలికి రండి. ఏమేమిటో అందామనుకున్నా కాని నేను యేమీ మాట్లాడలేకపోయాను. నాకా సమయంలో భయం వెయ్యలేదు. నాకు కావలసిన వ్యక్తి, సన్నిహితమైన మనిషి, నా యెదుటనిలబడ్డట్లు వూహించుకున్నాను. అతనేమనుకున్నాడో యేమో నాకు తెలీదు. అతి నిర్లక్ష్యంగా "లోకనాథం గారున్నారా ?" అన్నాడు. ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేదు. ఆయనన్న ముక్కలు నాచెవుల్లో ప్రతి ధ్వనించినాయ్యే గాని యేమంటున్నాడో తెలీదు. అతను నన్నుపైకీ

కిందకూ చూసాడు.నేను బాగా పొడగర్నే. సన్నగా వుండటం వలన యింకా యెక్కువ పొడుగ్గా కనిపిస్తా నంటారు గాని, నేను అయిదడుగుల ఆరంగు లున్నాను. ఇది ఈ మధ్య హైటో, వైటో చూసుకోవటంలో తెలిసింది. నన్ను చూసి అతను కూడ చాలా యిదిగా ఆశ్చర్య పోయి వుంటాడని అనుకుంటాను. నిజంగా నా మనస్సులో ఊహించుకోలేక పోయిన మనిషి నా యెదుట నిలబడ్డాడు. నాకుకావలసిన మనిషి నన్ను వెదుకుకుంటూ వచ్చి నట్టనిపించింది. ఆ సమయంలో నేను యేం చెయ్యాలో నాకేమీ తోచ లేదు. ఒక్క మాటకూడా మాట్లాడలేక పోయాను. అతను కళ్ళు కిందకు దించేసి, పాంట్ జేబులో చెయ్యి ఓ స్టయిల్‌గా చప్పున పెట్టేసి ఓ విజిటింగ్ కార్డ్ తీసి నాకిచ్చాడు. "నాకు ఫోన్ చెయ్య మనండి" అన్నాడు. ఆ మాట అంటూనే గిర్రున వెనక్కి కారు దగ్గరకు చకాచకా నడిచాడు. కార్లోకూచో గానే గిర్రున మలుపు తిరిగింది. ఆ కార్లో ఆయన ప్రక్కన నేను కూడా కూచున్నట్లు మే మిద్దరం బీచ్‌కు వెళ్ళినట్టు వూహించుకుంటూ నిల బడ్డాను. ఆనాడు నా ఊహలకు అంతులేదు. నాకు ఆ అనుభూతి చాలా విచిత్రంగా అనిపించింది. అసలు అలాంటి మనిషి వుంటాడని కూడా నేను ఊహించుకోలేక పోయాను. నాకు కావల్సింది నాకు తెలియటం లేదు. నే నెవర్ని కోరుకోవాలో నాకు అంతకంటె అగమ్యగోచరంగా వుంది. అలాంటప్పుడు నా సమస్యను పరిష్కారం చెయ్యటానికిగాను అతను మా యింటికి నన్ను వెదుక్కుంటూ వచ్చాడను కుంటాను. అతను కూడా నన్ను చూసి ఇదే అభిప్రాయపడి వుంటాడని అనుకోవటంలో తప్పేమీ లేదు. అతనికి కూడా నాకు వచ్చిన సమస్యేవచ్చి వుంటుంది. ఏమేమిటో అనుకుంటున్నా. ఇంతలోకి విసురున గాలొచ్చి ఆడోర్ కాస్త కిర్రున చప్పుడు చేస్తూ మూసుకుంది. చప్పున కళ్ళునలుపుకుంటూ గబ గబ లోపలికి వెళ్ళాను. డాడీ రాగానే యీ కార్డు యిచ్చేసి జరిగిందంతా

చెప్పాలి. అప్పుడాయన అతనికి ఫోన్‌చేసి పిలిపిస్తాడు. ఎంతో ఫన్. నా కోరిక తీరుతుంది. కాని వెంటనే నా కింకో ఆలోచన కూడా వచ్చేసింది. అసలు యీ సంగతి మా నాన్నకు తెలియనియ్య కూడదు. ఆయనకు 'సర్ప్రైజ్' యివ్వాలి. అనిపించింది. ఇట్లా కొంచెంసేపు మధనపడి చిట్టచివరికయితే యీ విషయం నాన్నకు చెప్పకూడదు అనే నిశ్చయానికి వచ్చేశాను. చాలా నిబ్బరంగానూ హుందాగానూ వుండి పోయాను. నాకేదో ప్లాన్ తట్టింది. ఆ ప్రకారం చేద్దామనుకున్నాను అంతే.

మర్నాడే మధ్యాహ్నం ఆ విజిటింగ్ కార్డ్ తీసుకుని ఆ ఫోన్ నెంబరు కలిపాను. అవతల్నుంచి 'యస్ హు ఈజ్ కాలింగ్' అనే శబ్దం వినిపించింది. ఆ ఫోన్‌లో ఆయన పూర్తిగా కనిపించినట్టే వుంది. నా యెదుట నిలబడి మాట్లాడుతున్నట్టే వుంది. నా వళ్లు గగుర్పొడిచింది. చెయ్యి చప్పున వణికింది. గొంతు సరి చేసుకుంటూ 'లోకనాథంగారి యింటి దగ్గర్నుంచి, వారమ్మాయి మాట్లాడుతోంది. మిమ్మల్ని రేపు మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటలకు యింటికి రమ్మన్నారు 'అన్నాను ఒక్క గుక్కలో.

అమ్మయ్య అంటూ రిసీవర్ కొంచెం అవతలకు పెట్టాను. మళ్ళీ యిట్టే దగ్గరకు తీసుకున్నాను. ఓ ... వెరీ మెనీ థాంక్స్. ఐ డూ కమ్ ......' వినిపించింది. 'తప్పకవస్తారు కదూ', అని అందామనుకుని అట్లాగే చెవి దగ్గర పట్టుకుని కూచున్నాను. ఏమీ అనలేదు, టెలిఫోన్ కట్ అయిపోయింది.

ఇహ సంతోషం పట్టలేక పోయాను. రేపు రెండు గంటలకు వస్తాడు. డాడీకి తెలీదు, తెలియకూడదు. తెలుసుకోవటానికి అవకాశంలేదు. ఎప్పుడూ సాయంత్రం అయిదు దాటితే గాని కాలేజినుంచి రాడు. రేపు ప్రత్యేకంగా మధ్యాహ్నం రెండింటికే యింటికి వస్తే! ఎందుకు వస్తాడు, రాడు. ముమ్మా

టికీ రాదు. మనస్సు వేసిన ప్రశ్నలన్నింటికి సమాధానాలు చెప్పేశాను. రేపు యీ యిల్లు యెట్లా అలంకరించి వుండాలి. నేనెట్లా వుండాలి, ఏ డ్రస్ వేసుకోవాలి. ఏ కలర్ బ్లౌజ్ నాకు మాచ్ అవుతుంది. ఎలాంటి నెక్లెస్ వేసుకోవాలి. లిప్‌స్టిక్ రాసుకుంటే బాగుంటుందా నేచురల్‌గా వుంటే బాగుంటుందా, జుట్టు ముడి వెయ్యాలా, పొడుగ్గా జడ వేలాడ దీస్తే బాగుంటుందా, ఇంకేవేవో ఆలోచించుకుంటున్నా. నిలువుటద్దం ముందు నిలబడి రకరకాల డ్రస్సులు వేసుకుని ఏది బాగుంటుందో చూస్తున్నాను. సాయంత్రం దాకా యీ అలంకరణ ట్రయిల్స్ తోనే కాలక్షేపం అయిపోయింది. ఎట్లాగైనా అతను వచ్చేటప్పటికి నేను యెంతో ఆకర్షణగానూ ఎట్రాక్టివ్ గానూ వుండాలి. అతని కళ్లు చెదిరి పోయేటట్టుండాలి. ఆఫ్టర్ ఆల్ ఆడదాని దగ్గర వున్నదేంటి ఆకర్షణ తప్ప అన్న మాటలు గుర్తుకొచ్చినాయి. అప్పట్లో ఆ మాట చదుతున్నప్పుడు ఆ రచయిత మీద చెడ్డకోపం వచ్చింది. ఇంత నిర్లక్ష్యంగా ఆడవాళ్ళను గురించి రాస్తాడా అనిపించింది. కాని ఆ మాటల్లో సత్యం యిప్పుడు నాకు తెలిసింది. నేను తెగ ప్రయాసపడ్డాను. తాపత్రయపడ్డాను. ప్రతి నిమిషం నాకు అదే ఆలోచనలో వుండిపోయాను. మా నాన్న వచ్చి ఏదో అడుగుతూ పరధ్యానంగా వుండి పోయాను. ఏదో సమాధానం చెపుతున్నాను. ఆబ్సెంట్ మైండెడ్‌నెస్ ప్రొఫెసర్స్‌కే కాదు, ప్రొఫెసర్స్ కూతుళ్ళకుకూడా వుంటుంది గామోలు అన్నాడు. ఏమిటి డాడీ నువ్వు మరీను ప్లీజ్ డిస్టర్బ్ చెయ్యవద్దు. నా మూడ్‌ని డిస్టర్బ్ చెయ్యొద్దు ప్లీజ్ అంటూ బతిమాలుకున్నా, ఆయన కూడా హాయిగా నవ్వేశాడు.

సరిగ్గా అనుకున్న టైంకు ఓ గంటే వ్యవధి వుంది. అప్పటికి గాని నా మనస్సుకు తట్టలేదు అతనొచ్చి మీ ఫాదర్ యెక్కడని అడుగుతే యేం సమాధానం చెప్పాలి. చప్పున భయమేసింది. ఇప్పుడా ప్రశ్నకు సమాధానం ఆలోచించే టైము లేదు. ఓమూల టిక్కు టిక్కుమంటూ గోడగడియారం ముందుకెళ్ళిపోతుంది. ఆ వేళ్లకి ఏది తోస్తే అది చెప్పెయ్యటమే అను

కున్నాను. చుడీదార్ పైజామా తొడుక్కున్నాను. స్కై బ్లూ గౌను దాని మీద చాలా బాగుంది. ఓ చేతికి బంగారపు గాజు ఇంకో చెయ్యి బోసిగానే వదిలేశాను. ఇప్పుడు రిస్టువాచ్ పెట్టుకోవటం అవుటాఫ్ ఫాషన్ అయి పోయింది. కొంచెం పౌడరు వత్తుగానే పూసుకున్నాను. జాస్మిన్ లావండర్ ఘుమాయింపు బాగా వుంది. ట్రేలో బిస్కట్లు, కేక్సు వుంచాను. జీడిపప్పు కూడా వుంది. రెండు కప్పులు రెడీగా ఉంచాను. ఇహ అతను రావటమే ఆలస్యం. నేను చెయ్యవలసినవన్నీ చేసాను హాలంతా పచార్లు చేస్తున్నాను. ఇహ రెండుసార్లు అటూయిటూ తిరిగితే అతను వచ్చేస్తాడు. రెండు గంటలు కొడుతోంది, కాలింగ్ బెల్ టంగ్ టంగ్ మంటుంది. సరిగ్గా రెండుగంటలు కొట్టింది. అమ్మో అనుకుని నా గుండెమీద చెయ్యి పెట్టుకున్నాను. గుండె దడదడ కొట్టుకోవటం మొదలు పెట్టింది. ఆ డోర్ వైపుకు చూసాను. కాలింగ్ బెల్ మోగింది. చప్పున డోర్ తెరిచాను అతనే. నిన్న వచ్చినతనే ఎదురుగా నిలబడి ఉన్నాడు.

గుడ్ మార్నింగ్ అన్నాడు, వెరీ గుడ్ మార్నింగ్ అంటూ లోపలికి రమ్మన్నాను. నెక్ టై సరి చేసుకుంటూ అటూ యిటూ చూస్తూ మొహం పైకీ కిందకీ కదిలిస్తూ కళ్ళార్పుతూ చిరునవ్వు మొహంతో వచ్చి సోఫాలో కూర్చున్నాడు. తలుపు నేనే దగ్గరగా వేసాను. అతను గమనించి కూడా ఏమి అనుకోలేదు. ఎదురుగా సోఫాలో కూర్చున్నాను. రెండు మూడు సార్లు అటూ యిటూ చూస్తూన్నట్టు నటించి నన్ను చూశాడు. అతనికళ్ళు ఇంకా పెద్దవయినాయి. బుగ్గలు ఉబ్బినాయి. రెండుచేతులూ వెనక్కు సోఫామీదకి చాచి రిలాక్సు అయ్యాడు. 'ప్లీజ్ హావ్ సమ్ స్నాక్స్ ...' అంటూ ప్లేటు అందిచ్చాను. అతను నాజూకుగా రెండు వేళ్ళతోనూ తీసుకుంటూ 'థాంక్స్' అన్నాడు. ఆ మాటలో ధీమా దిర్జా నాకు బాగా నచ్చాయి. అంతలో ఓ విధమైన సెల్ఫ్ కాన్ఫిడెన్స్ వున్నట్టు నేను పసికట్టాను. నాకు

అది చాలా ముఖ్యం. దీన్నే కొంతమంది గర్వం,మదం అంటారు. కాని నేనట్లా అనుకోను. అతని చూపుల్లో చాలా తీవ్రమైన ఆకర్షణ వుంది. ఆ కళ్ళల్లోకి యెంత సేపయినా చూడ బుద్ధి పుడుతుంది.... కాని నేనట్లా చూస్తూ కూచోటం ఏమీ బాగా అనిపించదు. నేను కూడా అతన్ని చాలా వరకు ఆకర్షించ గలిగాను అనే ధైర్యం వచ్చేసింది. టీ తీసుకుంటూనే ఆ గది వైపుకు డ్రాయింగ్ రూమ్ వైపుకూ ఏదో వెతుకుతున్నట్లుగా చూశాడు అతని కళ్ళు చెపుతూనే వున్నాయి. మీ డాడీ యెక్కడా అని అడుగు తూనే వున్నాయి. కాని ఆయన అడగలేదు. అతని ప్రశ్నేమిటో నాకు తెలిసిన తర్వాత సమాధానం చెప్పాల్సిన బాధ్యత నా మీద వుందని నాకు తెలుసు.

మా డాడీ యివ్వాళ అర్జంటు పనుండి ఆగిపోయారు....మిమ్మల్ని కాంటాక్ట్ చేసి చెప్ప మన్నారు, కాని నేనే చెప్పలేదు. దటీజ్ మై మిస్టేక్ ప్లీజ్ ... అంటూ నేను క్షమాపణ చెప్పబోతుండగా దట్సాల్ రైట్ ... దానికేముంది మళ్ళా యింకోప్పుడు కలుసుకోవచ్చు. బట్ ఐ యామ్ ఎక్స్ట్రీమ్లీ హాపీ టు మీట్ యూ అంటూ నా కళ్ళల్లోకిచూసి సౌమ్యంగా నవ్వాడు. నా ఒళ్ళు పులకరించింది. నాకు ఆ సమయంలో యేమనాలో యేం చెప్పాలో తోచలేదు, నన్ను నేను మరిచిపోయాను. అమాంతం లేచినిలబడి "థాంక్యూ ... థాంక్యూ," అంటూ ఎంత ఉద్దేశంగా అన్నాను, ఇంకా చాలా చాలా అందామనుకున్నాను. నోట్లోనే వుండి పోయినాయి. మా డాడే యీ నాడు రాడనే చెప్పినప్పుడు అతని మొహంలో యెలాంటి మార్పులేదు. అట్లాగే అని మామూలుగా అనేశాడు. తొణకలేదు. ఆశ్చర్య పడలేదు. ఆంత కంటే విసుక్కోనూ లేదు.

మీరేం చేస్తున్నారు. ఎక్కడుంటారు అని మాత్రం అడగగలిగాను. చప్పున సమాధానం చేప్పేసాడు. ఇంకా నేను యేమి మాట్లాడాలో యెట్లా

మాట్లాడాలో యేమడగాలో యే మడగకూడదో అనుకుంటున్నాను. ఇంతలోకి అతను చివాలున లేచి నిలబడ్డాడు. రెండు చేతుల్తోను కోటు సరి చేసుకుంటూ

'సో.. ఐ టేక్ లీవ్ టుడే. మెనీథాంక్స్ ఫర్ యువర్ హాస్పిటాలిటీ. నాకు ఫోన్ చెయ్యమనండి. నేవచ్చి కలుసుకుంటాను' అంటూ ఒకడగు ముందుకు వేశాడు.

ఎండిపోయిన గొంతుక తడి చేసుకుంటూ చాలా ప్రయత్నం చేసి మిమ్మల్ని ఫ్రైడే రమ్మన్నారు అనగలిగాను చప్పున రిస్ట్‌వాచ్ చూసుకుని ఫ్రైడే యిదే టైముకు 'ఓకే గుడ్‌బై'... అంటూ చక చకా వీథి గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. అతని కంటే ముందుగా నేనే వెళ్ళి ఆడోరీను తీసి నిలబడ్డాను. ఆయన ముందుకు వెళ్ళి మళ్ళా వెనక్కి తిరిగి నన్ను చూసి చెయ్యి చూపించి మరీ కారులో కూర్చున్నాడు. అతని నవ్వులు నావళ్ళంతా గిలిగింతలు పెట్టాయి.

ఇది మొదటిసారి కలవటం వలన ఎక్కువగా మాట్లాడ లేకపోయాను. అది నా తప్పే. నేను యెంత సేపు మాట్లాడినా వినటానికి అతను సిద్ధంగానే వున్నాడు. అయితే అట్లా రెండు మూడు తడవలు మేం కలుసు కున్నాం. మొదటి సారి నేను చెప్పిన కారణం అతను నమ్మాడు. రెండో రోజు డాడీ రాకపోవటానికి కారణం నేను యేదో చెప్పినప్పటికీ అది అతను నమ్మలేదని నాకు గట్టిగా తెలుసు అసలు మా డాడీకి అతను వచ్చిన విషయం కూడా చెప్పలేదని పసికట్టాడని తెలుసు. అయితే ఆ విషయం అతను బాహాటంగా చెప్పటం లేదు. నా మనస్సు అతను గుర్తు పట్టాడు. అందుకనే ఆ ప్రస్తావన అతను తీసుకు రావటం లేదు. తర్వాత రెండు సార్లు కలుసు కున్నప్పుడూ మేము యెన్నెన్నో విషయలు మాట్లాడుకున్నాం, ఒకరి విషయం ఒకరు తెలుసు

కున్నాం. అతనే మీ మాట్లాడ లేదు. నా విషయం అంతా చెప్పినా కూడా అతను యేమీ మాట్లాడక పోతే నాకేమీ ఆశ్చర్యంగా లేదు. నాలో దాచు కున్న రహస్యాలు అతనికి చెప్పాలని పించింది. కొన్ని చెప్పాను. కూడా ఇంత ఫ్రాంక్‌గా మాట్లాడటం అతనికి బాగా ఇష్టమే. ఒక్కొక్క రోజు ఒక్కొక్క యుగంగా గడిచి పోతోంది.

అసలు ఘడియ రానే వచ్చింది. రాత్రి ఎనిమిది దాటింది. ప్రోగ్రాం ప్రకారం శ్రీధర్ వచ్చేశాడు. మా నాన్న ఆ రాత్రి పదింటికి గాని రానని చెప్పాడు. తలుపు వేసుకుని జాగ్రత్తగా పడుకోమని చెప్పి మరీ వెళ్ళాడు. ఇవ్వాళ నా మనస్సు విప్పి చెపుతానన్నాను. అందుకనే నా మనస్సు తెగ ఆరాటపడుతోంది, ఎట్లా చెప్పటం అని. అతన్ని సూటిగా రెండో బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్ళాను. అతను మారు మాటాడకుండా వచ్చేశాడు. నా ఒళ్ళు ఝల్లుమంది. కంపరం పుట్టుకొచ్చింది. ఎంతో భయపడ్డాను. మళ్ళీ మరుక్షణంలో ధైర్యం తెచ్చుకున్నాను, నేను చాలా దగ్గరగా వెళ్ళి అతని మొహంలో మొహం పెట్టి కళ్ళల్లోకి సూటిగా చూశాను. అతని చిరునవ్వు చెదరలేదు. అతనికీ తెలుసూ! ఆరాటాన్ని ఆపుకోలేకపోయాను. ఆవేశం హద్దులు తెంచుకుంది. నేను ఉక్కిరిబిక్కిరయి పోయాను. నా వళ్ళు నాకు తెలియలేదు. నా మనస్సు మనస్సులో లేదు. గుండె దడదడ కొట్టుకుంది. బాగా విదిలించుకుని అతని చేతుల్లోంచి తప్పించుకుని బైటకువచ్చి పెద్దగ ఆయాసపడ్డాను. నా మొహంమీద చెమటలు కారుతుంటే పెద్దగా నిట్టూరుస్తూ అతని వంకే తీవ్రంగా చూసాను. అతని మొహంలో రాక్షసత్వం తాండవం ఆడుతున్నట్టుంది. అతని పశుబలానికి నా నాజూకు శరీరం హూనం హూనం అయిపోయినట్లనిపించింది. అతనూ జంకుతూ మెల్లిగాలేచి నిలబడ్డాడు. రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. అతను భయపడిపోయాడు. నా చేతులు మొహాన్నుంచి

తియ్యటానికి ప్రయత్నించాడు. కాని నేను పట్టు విడవలేదు, 'డోన్ట్ టచ్ మీ ' అంటూ బిగ్గరగా అరిచాను.

ఆ సమయంలో ఆ కిటికీ దగ్గర బైట ఎవరో వున్నట్టు, కిటికీ లోంచి చూచినట్టు నాకు అనుమానం వేసింది. ఆనాడెప్పుడో నేను అక్కడే బైట నిలబడి గుస గుసలు విన్నాను, కిటికీ లోంచి చూశాను. ఆ దృశ్యం నా కళ్ళకు కట్టినట్టయింది. ఎవరో తప్పక చూచి వుంటారు. ఎవరో కాదు డాడీ వచ్చి వుంటాడు. తలుచు కుంటే దుఃఖం పొంగి పొరలి పోయింది. ఏడుస్తున్నాను.

'ఏడ్వవద్దు...ఐ లవ్ యూ. మనిద్దరం...పెళ్ళి చేసుకుందాం ... నన్ను ఊరడించటానికి ప్రయత్నం చేశాడు. కాని నాకా సమయంలో మాటలు వినిపించ లేదు. నేను యెంతో ఘోరమైన తప్పు చేసినట్టు బాధ పడ్డాను. అతని మాటలు నాకేమి వినిపించలేదు. నా మనస్సు యింకా ఆ కిటికీ దగ్గర యెవరో వ్యక్తి వున్నట్టు చెపుతోంది. మళ్ళీ దుఃఖము పొర్లు కొచ్చింది. ఆదరాబాదరా టైము చూసుకొని అతను మా నాన్న యింటికి రాక మునుపే వెళ్ళి పోయాడు. ఆ బెడ్ రూమ్, హాలు మామూలుగా కనిపించటానికి నేను యెంతో శ్రమ పడ్డాను. మానాన్న ప్రతి చిన్న విషయాన్ని యిట్టే పట్టేస్తాడు. పైకి ఒక్కమాట అనడు. అంతా మనస్సులోనే దాచు కుంటాడు. కాని ఆయనకు యిప్పుడు జరిగిన విషయం తాలూకు ఏ సంగతీ, ఏ మార్పు తెలియ కూడదని శాయశక్తులా ప్రయత్నించాను. మళ్ళీ నేను మామూలు మనిషి అవటానికి చాలా సేపు పట్టింది. ఆ రాత్రి నిద్ర లేదు. సరిగదా మర్నాడు, మూడో నాడు కూడా అంతే. పగలంతా యేమిటో పిచ్చి పిచ్చిగా వుంటుంది. ఏమీ తోచదు. ఎంత ఘోరమైన పని చేశాను. అని నన్ను నేను నిందించు కుంటున్నాను. నిలువుటద్దం ముందు నిలబడి నన్ను నేను చూసుకుంటుంటే

నాలో ఎంతో మార్పు వచ్చినట్టు నాకే కనిపిస్తోంది. అయితే యీ మార్పును మా నాన్నకు తెలీకుండా శాయశక్తులా ప్రయత్నం చేస్తూ వచ్చాను. నాకిప్పటికీ పూర్తి నమ్మకం ఆనాటిరాత్రి ఆ కిటికీ దిగ్గర యెవరో వున్నట్టు. నేననుకున్న రహస్యం అనేది బైట పడ్డట్టయితే యెవరున్నారో నేను చెప్పలేను. నేను అనుకున్నట్టు మా డాడీ మాత్రం కాదు. ఒకవేళ ఆయనే కనక పసికట్టివుంటే అప్పటికప్పుడే అడిగేవాడు. ఇంత తాపీగా వూరుకోడు. ఆయనలో మార్పేమీ లేదు. వచ్చిన మార్పంతా నాలోనే. మళ్ళా రెండు రోజుల తర్వాత సరిగ్గా మధ్యాహ్నం ఫోన్ మోగింది. శ్రీధర్ మాట్లాడు తున్నాడు. 'సునీతా ! నువ్వు నన్ను నమ్ము, నిన్ను మనసారా ప్రేమించాను. మనం పెళ్ళి చేసుకుందాం ...... నువ్వెందుకు భయ పడుతున్నావో నాకర్థం కావటంలేదు.' అతను అన్న మాటలు విని 'ఫోన్' పెట్టేశాను. నేను ఏమీ సమాధానం చెప్పలేదు. అతనితో యేమీ మాట్లాడ బుద్ధిపుట్టటం లేదు. అతన్ని చూడటం అంటే అసహ్యం వేస్తోంది. అతనిమీద నాకున్న ఆప్యాయత, మమకారం, కాంక్ష యింకా అన్నీ కూడా ఆనాటి తోనే పోయి నాయి. నాకసలు అతన్ని చూడ బుద్ధిపుట్టటం లేదు. పాపం అతను ఫోన్ చేస్తూనే వున్నాడు. వీలు చూసుకుని వస్తూనే వున్నాడు కూడా. అయినా ముక్తసరిగా మాట్లాడటం పంపించేయటం, యిట్లాగే చేస్తున్నా. నేను తప్పు చేశానో, తప్పు చేస్తున్నానో నాకు తెలీదు. అతను చాలా మంచి వాడు. నిష్కల్మషమైన హృదయం గలవాడు. నా మీద యెన్నో ఆశలు పెట్టు కున్నాడు. ఆశలు పెంచుకున్నాడు. అతని లోపం కాదు. ఆనాడు రాత్రి కూడా నా ప్రోద్బలానికే లొంగి పోయాడు. నన్ను సంతోష పెట్టటానికే అతను అన్ని విధాల తాపత్రయపడ్డాడు. అతన్ని నిందించటానికి వీల్లేదు. తప్పంటూ ఏదన్నా జరిగివుంటే అది నా మూలానే. కాని ఎవరు కారణం అనేది తర్వాత విషయం. నాకు అతనంటే ఏవగింపు, అసహ్యం ఎర్పడ్డాయి.

అతన్ని కలుసుకోవాలని కానీ, అతనితో మాట్లాడాలని కానీ నాకు ఏ మాత్రం లేదు.

ఓ వారం గడిచి పోయింది. పది రోజులయింది. నాలో చైతన్యం నశించింది. ఏదో యాంత్రికంగా పనులన్నీ సాగిపోతున్నాయి. తెల్లారుతుంది, పొద్దు గూకుతుంది. ఇదీవరస. రాత్రికీ పగలుకూ తేడా యేమీ కనిపించటం లేదు. నాకు యిష్టం వచ్చినప్పుడు నిద్రపోవటం, ఇష్టం వచ్చినప్పుడు లేవడం, ఒళ్ళు విరుపుగా వుంటుంది. ఏ పనీ చెయ్యబుద్ధి పుట్టడం లేదు. ఈ నెల రోజుల్లో శ్రీధర్ ఎన్నిసార్లు ఫోన్ చేసాడో అంతులేదు. ఇంటికి, రావడమూ తగ్గించలేదు. అతనేదో ఘోరమైన అన్యాయం చేసిన వాడిలాగ నిందితుడు మాదిరిగ నా ఎదుట నిలబడటం నాకేమాత్రం ఇష్టం లేదు. వచ్చినప్పుడల్లా అట్లాగే మాట్లాడుతాడు. ఇన్నిసార్లు వచ్చి యింత యిదిగ బ్రతిమలాడటం, నేను తిరస్కారంగా మాట్లాడటం నా మనస్సుకు నాకే కష్టంగా వుంది. నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. అది అతనితో స్పష్టంగా చెప్పేశాను. అతని మనస్సు కరిగిపోయి వుంటుంది. అతనేమనుకున్నాడో ఏమో మళ్ళీ నాకు ఫోను చెయ్యలేదు. ఇంటికి రాలేదు. అతను రాకపోవటం వలన నా ఆత్మీయులెవరో నాకు దూరమయి పోయినట్టే అనిపించేది. అతను ఫోనుచేస్తే బాగుండుననిపించేది. నేనే వుండి వుండి ఫోను చేశాను. 'శ్రీధర్ నా మనస్సు బాగాలేక నీతో సరిగ్గా మాట్లాడలేదు. నన్ను మిసండర్ స్టాండ్ చేసుకోవద్దు' అని ఫోనుపెట్టేశాను. మళ్ళీ అతను ఫోను చెయ్యటం ప్రారంభ మయింది. ఇంటికి కూడా వస్తున్నాడు. ఇలా సంఘర్షణ జరుగుతూ వుంటే ఓ సారి మా నాన్న నా దగ్గరికి వచ్చి ఏమిట్రా ఈ మధ్య అదో విధంగా వుంటున్నావు, చెప్పు. నీకు, అమ్మ గుర్తుకొచ్చిందా అన్నాడు.

అమ్మ మాట యెత్తవద్దు. నాకు అమ్మ లేదు, నాకు అమ్మ లేదు అంటూ బిగ్గరగా ఏడ్చాను. మా నాన్న హడలిపోయాడు.

ఎందుకురా అంతఏడుపు నే నేమన్నానని, నీమనస్సులో యేముందో తెలుసుకోలేక ఆడపిల్లవు కదా యీ వయస్సులో అమ్మ గుర్తుకు రావటం సహజం అని అన్నాను. నువ్వు దానికింత యిది చెయ్యాలా అంటూ చాలా సేపు నన్ను ఊరడించటానికి ప్రయత్నం చేశాడు.

నన్ను పలకరించక డాడీ నామనస్సేమీ బాగాలేదు. నన్ను ఒంటరిగా వదిలేసెయ్యి ప్లీజ్ అంటూ యింకా బిగ్గరగా అరిచాను. ఆయన అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. కాలేజీకి వెళుతూ ' చూడమ్మా శ్రీధర్ అనే కుర్రాణ్ణి రమ్మన్నాను. అతనొస్తే కాలేజీకి పంపించు, నా మూడ్ సరిగ్గా లేదు. కాలేజీకి వెళుతున్నాను, అంటూ చర్రున వాకిట్లోకి వెళ్ళిపోయాడు.

నాకు చెడ్డ భయమేసింది. శ్రీధర్ అనేమాట ఆయన నోటినుంచి వినేటప్పటికి. నా కాళ్ళూ చేతులూ వణికినాయి. శ్రీధర్ శ్రీధర్ అని నాలోనే అనుకున్నాను. ఎప్పుడూ నన్ను అమ్మా అని పిలువనివాడు యీ నాడు ఆయన గొంతులో కూడా యేదో మార్పు కనిపించింది. నేనన్న మాటలకు ఆయన మనస్సు బాధ పడివుంటుంది. చాలా తప్పు చేసాను. ఆయన్ను అట్లా అనకూడదు. నా బాధ చూసి ఆయన బాధపడ్డాడు. అంతే అను కున్నాను. ఆ క్షణాన కాలేజీకి వెళ్ళి క్షమాపణ కోరుకుందా మనుకున్నాను. కాని మనస్సు అటు మళ్ళలేదు. ఇంట్లోనే వుండిపోయాను.

మళ్ళీ ఫోను వచ్చింది. బద్ధకంగా రిసీవర్ తీసాను. నేనే శ్రీధర్‌ను మీ డాడీ నన్ను రమ్మన్నారు. చాలా కథ వుంది, తర్వాత చెపుతాను. ఇవ్వాళ రావటానికి మాత్రము వీలులేదని చెప్పు, నీ హెల్త్ ఎట్లా వున్నది.

నా హెల్త్‌కేం,చాలా బాగా వుంది. అంటూనే కళ్ళు తిరిగి అట్లానే సోఫాలో పడిపోయాను.

డోకులు వస్తున్నట్టు కడుపులో తిప్పుతున్నట్టు అనిపించింది. మా

నాన్న దగ్గర హోమియోపతి మందులున్నాయి. ఓ పుస్తకం వుంది. అది చదివి ఆ మాత్ర వేసుకున్నా తగ్గలేదు. తల తిరిగిపోతుంది. వికారంగా వుంది. మా నాన్న వచ్చీ రావడం తోనే సాధన పరుగెత్తుకుంటూ వెళ్ళి అమ్మగారికి వంట్లో యేమీ బాగా లేదండి అని చెప్పింది. మా నాన్న ఆదరా బాదరాగా వచ్చాడు. ఏమిటి ఎట్లా వుందంటూ, అప్పటికీ నాకు యీ సుస్తీ ఏమిటో తెలియటంలేదు. ఏదో అన్నంలో మార్పు వచ్చిందేమో అనుకున్నాను. అంతే, కొంచెంసేపటికి సర్దుకుంది. ఆ రాత్రి నిద్ర కూడా పోయాను. మర్నాడు తెల్లారి లేచినప్పటి నుంచీ మళ్ళీ ప్రారంభమయినాయి. నేనే డాక్టర్ని పిలవ వద్దన్నాను, నిన్న హోమియోపతి మందేసుకుంటే తగ్గి పోయినాయిలే. ప్రతిదానికి ఆర్భాటం అని తోసిపుచ్చేశాను.

చప్పున నా మనస్సుకు ఏదో తట్టింది. ఆఁ అనుకున్నాను, ఇట్టే కుంగిపోయాను. 'అమ్మో' అంటూ గుండెమీద చెయ్యి పెట్టుకుని పిచ్చి దానిలా హాలంతా తిరిగాను. ఇంకా వికారం ఎక్కువయింది. కడుపులో తిప్పుతున్నట్టనిపిస్తోంది. మతి కాలించింది. కెవ్వున కేకపెట్టి బిగ్గరగా ఏడ వాలనిపించింది. ఆ సమయాన యేం చెయ్యాలో తోచడంలేదు. ఇట్టే ఫోను దగ్గరకు వెళ్ళి శ్రీధర్‌కు ఫోను చేసాను, అతను లేడుట. టూర్ వెళ్ళాడు నాలుగు రోజుల్లో వస్తాడట. ఆసమయంలో అతన్ని అమాంతం నులిమేద్దా మన్నంత కసి వచ్చింది. గోడమీద కాలెండరు గాలికి వూగుతూ వుంటే ఆ కాలెండర్లో పిల్లాడు నన్ను చూసి వెక్కిరిస్తున్నట్టే అనిపిస్తోంది. ఇప్పుడెట్లా, యేం చెయ్యటం! ఎవరి దగ్గరికెళ్ళడం! శ్రీధరైనా వుంటే యేమైనా ఉపాయం చెప్పేవాడేమో! అతడులేడు సమయానికి ఎక్కడికైనా నర్సింగ్ హోంకు వెళ్ళి కన్‌సల్ట్ చేసివస్తే. డాడీకి తెలిస్తే యిహ నేను బ్రతకగలనా! ఇప్పుడే చచ్చిపోతే! ఇంక గత్యంతరం లేదు. ఆత్మహత్యే శరణ్యం. నిశ్చ యించేసుకున్నా, డాడీ కాలేజీ నుంచి వచ్చేలోగనే చచ్చిపోవాలి. నేను

నాన్న మొహం చూడలేను. ఆయనకు అప్రదిష్ట తెచ్చిపెట్టలేను. నేనంటే పంచప్రాణాలు. నేను యీ పని చేశానని తెలుస్తే ఆయన భరించగలడా! ఆయనింక జీవించగలడా! ఇది అసంభవం, నేను చచ్చిపోతే మా నాన్న ఆ దుఃఖాన్ని భరించగలడా? ఏమో! చూడ్డానికి నేను వుండను. నేను పోయిన తర్వాత యెవ్వరు యెట్లా వుంటారో ఏమో! అమ్మా నన్ను యెంత దుస్థితికి తీసుకొచ్చావు. నువ్వే కనుక వుంటే ఇట్లా జరిగేదేనా? అసలు నీ మూలానేగా యింత ఘోరం జరిగింది, నువ్వే నేర్పావు. నువ్వే కారణం. ఈ కొంపకు చిచ్చు పెట్టింది నువ్వు. అందరి జీవితాలు నాశనం చెయ్యటానికి కంకణం కట్టుకున్నావు.నీకీ మాట తెలిస్తే నువ్వెంత సంతోష పడతావో! నీ మనస్సెంత చల్లబడుతుందో! నేను సర్వనాశనం అవటమే నీ కోరిక. నీ కోరిక తీర్చానమ్మా. నేను పోయేముందు నీకెట్లాగైనా నేను చేసిన పాపం సంగతి కబురు చేస్తాను. నువ్వు చాలా సంతృప్తి పడతావు. ఎమిటో వెర్రివెర్రిగా ఆలోచించాకుంటూ తత్తరబడిపోతున్నాను. మనిషికి బ్రతకటా నికి ఎంత ధైర్యంకావాలో చావటానికి అంతకంటె యెక్కువ ధైర్యంకావాలి. నాకు పిరికితనం లేదు. నేను సాహసురాలిని. అదంతా ఎక్కడపోయింది! నా ధైర్యమంతా ఎక్కడికి పోయిందో యేమో! నేను పూర్తిగా పిరికి దాన్నయిపోయాను. నేను యిప్పుడు యేమీ చెయ్యలేని పరిస్థితిలో వుండి పోయాను. ఆత్మహత్య చేసుకోవటం అసంభవం. ఏం చెయ్యాలో తోచటం లేదు. ఎట్లా జరగాలో అట్లాగే జరుగుతుంది. ఎన్నెన్నో సమస్యల్ని కాలమే పరిష్కారం చేసింది. ఈ సమస్యకూడా అంతే! ఇట్లాగే వుండిపోతాను. అని నాలో నేను అనుకున్నాను. పట్టుబిగువున కూర్చున్నాను. కాని లోపల్నుంచి తొలుచుకొస్తోంది. దుఃఖము పొర్లుకొస్తోంది. ఆందోళన, ఆరాటం యెక్కు వయినాయి. ఇవన్నీ కూడా ఆపుకోలేకపోతున్నాను. ఇది కేవలం నా సమస్యే కాదు. నామూలాన అందిరికి తలవంపులుగా వుంటుంది. నాకు కావాల్సిన

వాళ్ళు, సంబంధించిన వాళ్ళు అందరూ కూడా నన్ను చూసి అసహ్యించు కుంటారు, చీదరించుకుంటారు. వింతసమస్య తెచ్చిపెట్టాను. ఎంత బాధ పెట్టబోతున్నాను. నేను బ్రతికి వుండి యివన్నీ చూస్తూ వుండటమా! కళ్ళు మూసుకుని నిశ్చింతగా యింకో లోకానికి వెళ్ళిపోవడమా? ఇదే సమస్య తెగ కుండా వుంది.

ఇంతలోకి డాడీ డాక్టరు గార్ని తీసుకురానే వచ్చారు.

'ఈజ్ షీ మ్యారీడ్?' అని డాక్టరు గారు అడగటం స్పష్టంగా విని పించింది.

'నో ... నో ... షీ ఈస్ మై డాటర్, సునీత !' అని మానాన్న అనటం కూడా స్పష్టంగా వినపడింది. ఆ సమయంలో యెట్లా నిబ్బరంగా వుండగలిగానో నాకే ఆశ్చర్యంగా వుంది. వాళ్ళిద్దరూ నాదగ్గ రకు వస్తూంటే నా వెన్ను లోంచి వణుకు పుట్టుకు వచ్చింది. అన్ని తమా యించుకొని నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని మెల్లిగా లేచి కూచున్నాను.

నమస్తే అన్నాను, పెదిమల మీదికి చిరునవ్వు తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ. డాక్టర్లు వేసే మామూలు ప్రశ్నలన్నిటికీ సమానాలు చెప్పాను. కాని ఆయన తృప్తి పడలేదు. మానాన్నను చాటుగా పిలిచి యేమిటో చెప్పాడు. నాకు గుండె దిడగానే వుంది.

ఓసారి క్లినిక్‌కి వెళ్ళొద్దాం రారా అన్నాడు, డాడీ. నా ప్రాణాలు పైకి ఎగిరి పోయినాయి. వెళ్ళటమా వెళ్ళక పోవటమా అందులో నా నిర్ణయం యేమీలేదు. అప్పుడే డాడీ నా చెయ్యి పట్టుకొని లేవదీశాడు కూడా. మెల్లిగా వాళ్ళ వెంబడే వెళ్ళి కార్లో కూర్చున్నాను. తీరా క్లినిక్ వెళ్ళేటప్పటికి కేర్ కేర్‌మని పిల్లల ఏడుపులే నాకు వినిపిస్తున్నాయి. దద్దరిల్లి పోయాను. మూర్ఛ వచ్చినంత పనయింది. ఎట్లా గొట్లా మా నాన్న చెయ్యి

పట్టుకుని మెల్లిగా కారిడార్లోకి వెళ్ళ గలిగాను. అప్పటి కప్పుడే డాక్టరు సునంది వచ్చేసింది. నా భుజాన్ని తట్టి 'డోన్ట్‌వరీ, ఏం భయంలేదు. ఈ కాప్సెల్స్‌తో తగ్గి పోతుం' అంటూ నా మొహంలోకి నవ్వుతూ చూసింది.

నాకెంతో ధైర్యం వచ్చింది. నా అంతట నేనే లేచి కూర్చున్నాను. చకచక బైటకు నడిచి వచ్చేశాను. నా ఎదురుగా ఇద్దరు ముగ్గురు వికార పడుతూ నానా అవస్థపడుతూ వచ్చారు.

"బీ కేర్ ఫుల్. ఇప్పుడు కొంచెం కలరా కేసులొస్తున్నాయి..." అని యెవరో డాక్టరు ఒక పెషెంటుని హెచ్చరించటం విన్నాను.

మానాన్న కార్లో కూర్చున్న తర్వాత చెప్పాడు. ఆ డాక్టరు చెబితే నేను హడలి పోయాను. కలరా అంటే నాకు మతి పోయింది. నాకు తెలీదు. మా ఫాదరంటే మీ తాతగారు కలరా వచ్చే పోయారు. అంటూ అప్పటి సంగతులన్నీ చెప్పటం మొదలు పెట్టాడు.

డాడీ, నువ్వొట్టి పిరికి వాడివి, అని నేను ఎగతాళిగా మాట్లాడాను. ఇంటికి వచ్చిం తర్వాత కూడా వికారం, కడుపులో తిప్పటం తగ్గలేదు. నాకు అప్పుడప్పుడు యిలాగే వస్తూనే వుండేది. వికారం వచ్చినప్పు డల్లా నా వళ్ళు ఝల్లు మనేది. ఎట్లా గొట్లా మనస్సు చిక్క పట్టుకొని బింకంగా వుండి పోయాను. క్రమక్రమంగా ఆ ఫీలింగ్ నాలో కనిపించ కుండా పోయింది. అది తలుచు కున్నప్పుడల్లా ఏంత భయం వేసేదో ఎంతగాభ రాగా వుండేదో చెప్పటానికి వీల్లేదు. భగవంతుడనే వాడు ఉన్నాడో లేడో నాకు తెలీదు. కాని నేను చేసిన తప్పుకు నన్ను శిక్షించలేదు, క్షమించాడు. అది నాకు పెద్ద వరం. శిక్ష పొందటం తేలికేమో, అసలు శిక్షపడాల్సిందే. తప్పించు కోవటానికి వీలులేదు. అయితే నాకు శిక్ష విధించకుండా నన్ను వదిలేశాడు. బహుశా నేను కొత్త జీవితాన్ని ప్రారంభించి సక్రమంగా

నడుచుకో గలననే విశ్వాసం నా మీద ఉందేమో. అలాంటి నమ్మకాన్ని నేను నాశనం చెయ్యను, చెయ్యలేను. మా అమ్మకోసం మా నాన్న పెట్టిన గులాబీ మొక్కల్ని మధ్యకు రెండుగా తుంచేసింది. అయినా ఆ గులాబీలు మళ్ళీ రెమ్మలు వేసినాయి. పూలు పూసినాయి. నా జీవితానికీ ఆగులాబీ మొక్కలకు యేదో పోలిక వుందని నేను అనుకుంటాను. జీవితంలో తప్పు చేయిటం ఓ వంతు. ఆ తప్పు దిద్దుకుని సరిగా నడవటం చాలా ముఖ్యం. అలాంటి అవకాశం నాకు వచ్చినపుడు నేను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలనే నాకు వుంది. ఇప్పు డిప్పుడే మానాన్నతో చనువుగా చొరవ గాను మాట్లాడు తున్నాను. ఆయన అన్నమాట లన్నింటికి సూటిగా సమాధానాలు కూడా చెపుతున్నా. అయన మనస్సుకు ఎంతో సంతోషంగావుంది. అదే నా సంతోషము. నిజం చెప్పి ఆయన్ను కష్టపెట్టటంలో అర్థం లేదు. అసలు ఆలాంటి నిజం చెప్ప కూడదు. ఒక సత్యాన్ని బయట పెడితే నలుగురి ఉపయోగంగానూ సంతోషంగానూ వుండాలి. అందరూ హర్షించే టట్టుండాలి. అంతేగాని కేవలం నిజం గాబట్టి చెప్పి తీరాలి, అని నేను అనుకోను.

ఇప్పుడు నా మనస్సులో యే కోరికా లేదు. ఏతాపత్రయమూ లేదు. ఏ ఆరాటమూ లేదు. శ్రీధర్ అంటే ప్రత్యేకంగా నాకు మక్కువా లేదు, ద్వేషమూ లేదు. నా రహస్యాలన్నీ తెలుసుకుని నన్ను చులకనచేసిన మనిషితో నాకే సంబంధమూ లేదు. అతన్ని నేను పెళ్ళి చేసుకోవటంలో యేమీ 'థ్రిల్' లేదు. మళ్ళీ అతను నాకుఫోన్ చెయ్యనూ లేదు. నేనూ చెయ్య లేదు. నాకు అవసరం లేదు, అవసరం వుందీ అని అనుకున్న నాడు ఆతడు దొరకనూ లేదు. ఇప్పుడతను ఎవరో? నే నెవరో ?

డాడీ నా బర్త్‌డే నాడు అట్టహసంగా నలుగుర్నీ పిలిచాడు. ఎంతో మంది నన్ను ఆశీర్వదించారు. నేనే రెండు పాటలు పాడాను. నా గొంతుక

బాగుందని అందరూ మెచ్చుకున్నారు. ఆ నాడు కట్టుకున్న చీరె నాకు చాలా అందంగా కనిపించింది. నేనుచీర కట్టుకుంటేనే అందంగా వుంటాను, మిగతా డ్రస్సుల్లో అంత బ్యూటిఫుల్‌గా కనిపించను. ఈ విషయము అద్దమే చెపుతుంది. ఇప్పుడిప్పుడే నాకు మంచి చీరలు కట్టుకోవాలని, నలుగురిలో తిరగాలని ఉత్సాహం కలుగు తోంది. అంత పెద్ద ఇంట్లో నాకు వుండాలని పించటం లేదు. అసలు ఆ యింట్లోనే నాకు వుండ బుద్ధి పుట్టటంలేదు. నా యింటికి నేను వెళ్ళి పోవాలి. నా యిల్లెక్కడుందో ఏమో ! అది మానాన్నకు తెలుసు. అందుకనే ఆయన నా పెళ్ళి విషయం మాట్లాడితే డాడీ అంతా నీ యిష్టం. నువ్వే సంబంధం తెస్తే అదే నా యిష్టం. నీ మీద చెప్పలేనంత విశ్వాసం వుంది. నువ్వు తెచ్చిన సంబంధం కాదంటానా అని నా మనస్సులో మాట చెప్పేశాను. నిజానికి కూడా అంతే. డాడీ చాలా మంచి వాడు. ఆయన కన్నీ తెలుసు. అందులో నా మనస్సు బాగా తెలుసు. నాకు తగిన సంబంధం తెస్తాడనే నమ్మకం నాకు యెప్పుడూ వుంది. ఈ విషయం చెప్పటం తెలియకే యిన్నాళ్ళు బట్టి యిట్లా వుండి పోయాను. ఏ సంబంధం చేసుకున్నా నాకు అమ్మపోలిక రాకూడదు. మా అమ్మ మాదిరి సంసారాన్ని పాడు చేసుకోను అంత వరకు నాకు ధైర్యం వుంది.

డాడీ ఎనౌన్స్‌చేసాడు. రేపే పెళ్ళి చూపులకు వస్తున్నారు అని. నేను చలించలేదు. నేను మాట్లాడలేదు, ఆశ్చర్యమూలేదు, సిగ్గూ పడలేదు, భయం అంతకంటే లేదు. మామూలుగా ముస్తాబయి కూర్చున్నాను. వాళ్ళెవరో వచ్చారు. ఎవరొచ్చారో కూడా నేను పట్టించుకోలేదు. కాని నాలో అప్పుడు యెన్నెన్నో వూహాలోచనలు చెలరేగినాయి గతమంతా ఒక్కసారిగా కళ్ళల్లోకి వచ్చి యిట్టే అదృశ్యమై పోతున్నాయి. నేను చదివిన పుస్తకాల్లో నాయికా నాయకులు నన్ను పలకరించిపోతున్నారు. అందరూ తలొకతీరూను.

అందులో నేనొక తీరు. నాలాంటి నాయిక ఏ నవల్లోనూ, ఏ కథల్లోనూ యింతవరకూ రాలేదు. ఇలాంటి ఆడది వుంటుందని వూహించటం కష్టమే. నిజానికి కొన్నికొన్ని కథల్లో యింకా వింత ప్రకృతులు చూశాను. కాని అవి అసహజంగా వున్నాయని కొట్టిపారేశాను. కాని నా జీవితం చూస్తుంటే అవి చాలా సహజంగా కనిపిస్తాయి. నాజీవితమంతా యెవ్వరితోనైనా చెప్పినా యెవ్వరూ నమ్మేటట్టుండదు. అయినా నేను యెవ్వరితోనూ చెప్పను. గత జీవితమంతా నాలోనే యిముడ్చుకుని కొత్త కాపురాన్ని సాగిస్తాను. నా విషయం యెవ్వరికీ తెలియనివ్వను. అయితే శ్రీధర్ నా మీద కసికొద్దీపగ పడితే నేను చెప్పలేను. అప్పుడుకూడా నేను కాదిని అబద్ధం ఆడే ధైర్యం నాకు వుంది. దాఖలాలు లేవు, ఆధారాలూ లేవు. అతను నా మీద పగబట్టి సాధించేదేమీ వుండదు కూడా. అతను మగవాడు. అతనికి ఎక్కడో యేదో మంచి సంబంధం దొరుకుతుంది. వాళ్లు సుఖంగా వుంటారు. ఈ విశాల ప్రపంచంలో యెప్పుడైనా ఎక్కడైనా కనిపిస్తే కనిపించొచ్చు. నేను భయపడాల్సిన పనేమీ వుండదు. నాకు అండ ఒకటుంది. రక్షణ వుంటుంది. నా ప్రక్కన నిలబడే వ్యక్తి నాకు అన్ని విధాల సహకారంగానూ సహాయంగానూ వుంటాడు. ఆయన విశ్వాసం, నమ్మకం చలించే పనులు ఏమీ చెయ్యను. నాయింటిని నేను చక్క బెట్టుకో గలను. ఏ వేవో మన స్సులో మెదులు తున్నాయి.

ఇంతలోకి డాడీ వచ్చి నన్ను ప్రక్క గదిలోకి తీసుకుపోయాడు. వాళ్లు నిన్ను పాట పాడ మంటున్నారు, అని నన్ను ప్రాధేయ పడు తున్నట్లుగా అడిగాడు. నాకు యితరుల ముందు పాడట మంటే చెడ్డ మంట నా యిష్టమైతే నేను ఎన్నైనా పాడతాను. అందుకనే నన్నులోపలికి తీసుక వెళ్లి నాతో చెప్పటం. నాకూ చెడ్డ నవ్వు వచ్చింది. నేను ఎవ్వరినైనా పెళ్లి చేసుకుంటాను, అని చెప్పిన తర్వాత యీపాట పాడటంలో నాకు

ఆభ్యంతరం యేముంటుంది. వాళ్లు పూర్వ కాలం వాళ్లు అందులో నాకు కాబోయే అత్తగారు. అదీగాక, ఆవిడకు సంగీతం అంటే మహా ఇష్టం. నువ్వు బాగా పాడతావని కూడా చెప్పాను. నీ యిష్టం అంటూ డాడీ ఆపేశాడు.

నాదేం లేదు. మీరు పాడ మంటే పాడతాను, మీరు చెప్పటం ఆల స్యం నేను చేస్తాను అన్నాను. మానాన్న ఆనందానికి హద్దులేదు. ఆయ నకు ఆ రోజు మరవలేనిది. నువ్వు పాట పాడుతూ వుంటే అతను రానే వస్తాడు. అదిగో వాకిట్లో కారాగింది. వచ్చేశాడు. అతను కూడ అంటూనే మానాన్న చప్పున అటు వెళ్ళాడు. నేను కూడా వచ్చేసి నలు గురి ముందర కూర్చున్నాను. ఇదంతా యేదో కథగా వుంది. ఆయితే కథల్లో ఇలాంటి పరిస్థితుల్లో అదివరకు అనుకున్న వరుడే సాక్షాత్కా రిస్తాడు. అప్పటికి గాని, ముగింపు సార్థకం కాదు. అటు రయితకూ యిటు పాఠకులకు కూడా సంతృప్తి ఉండదు. ఓ వ్యక్తి తప్పు చేసిన తర్వాత పశ్చాత్తాప పడి సక్రమంగా నడుచు కొనడానికి ప్రయత్నం చేస్తే నలుగురూ సంతోషిస్తారు. సపోర్ట్ చేస్తారు. నిజంగా సంతోషించాలి. సపోర్ట్ చేయాలి. అందుకనే కథలో అట్లా ముగింపు వుంటుంది. కాని యిది జీవితం, కథ కాదు. నాది అంతా తమాషా జీవితం. కాని చిత్రంగా నా జీవితంలో కూడా కథ మాదిరి ముగింపే వచ్చింది. ఆ వచ్చిన వరుడు శ్రీధరే! ఇదే నా అదృష్టం.

****